ఈనాడు
కుమురం భీం
గురువారం 31 ఆగస్టు 2017 | 16 పేజీలు

ఎస్పీఎం చర్చల్లో పురోగతి

- ప్రభుత్వం, ఐడీబీఐ, పారిశ్రామికవేత్తల చర్చలు సానుకూలం
- ఆరు కంపెనీల ప్రతినిధుల హాజరు
- మరో పది రోజుల్లోపు మలివిడత చర్చలు



ఐడీబీఐ, పారిశ్రామిక వేత్తలతో చర్చలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

సిర్పూరు కాగితం మిల్లు(ఎస్పీఎం) పునరుద్ధరణపై ఐడీబీఐ, ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తల మధ్య జరిగిన చర్చల్లో పురోగతి వచ్చింది. ముంబాయిలో జరగాల్సిన చర్చలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడటంతో మంగళవారం హైదరాబాద్‌లో దాదాపు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చల్లో ఐడీబీఐ, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వం ప్రతినిధులు ఓ నిర్ణయానికి కూడా వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. మరో విడత చర్చలు జరిపి, త్వరలోనే మిల్లును షార్టు టెండరు ద్వారా బహిరంగవేలం వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా మిల్లు ఆస్తి తగ్గింపు, పారిశ్రామిక వేత్తల ఆసక్తి... ప్రభుత్వం కల్పించే రాయితీలపైనే చర్చ జరిగింది.

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)వైస్ ఛైర్మన్ మైథిలి సుబ్రహ్మణ్యం, ఐటీసీ, పెప్సీల్, జేకే, వెస్ట్‌కోస్ట్, సిద్ధి రిద్ధి, సీజీఆర్ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ పారిశ్రమల కార్యదర్శి రంజన్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీఎం కార్మికులు కుశన్న రాజన్న, గడదాసు మల్లయ్య, జి.నారాయణ, రాజేశ్వర్‌రావు, పి.శంకరయ్య పాల్గొన్నారు. ముందుగా ఐడీబీఐ వైస్ ఛైర్మన్ ఎస్పీఎం కాగితం మిల్లులోని యంత్రాలు, ఖాళీ స్థలం, ఇతర వివరాలు, ఆస్తి విలువ, తదితర అంశాలను హాజరైన పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ఎస్పీఎం పునరుద్ధరణకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన పారిశ్రామిక విధానం కింద కల్పించే రాయితీలను పరిశ్రమల కార్యదర్శి రంజన్ వివరించారు. అనంతరం ఎస్పీఎం విలువ తగ్గింపు... పారిశ్రామిక వేత్తల ఆసక్తి... ఎంతమేరకు ఎస్పీఎం మిల్లు పునరుద్ధరణకు వెచ్చించేందుకు ముందుకు వస్తారు? తదితర అంశాలపై ప్రతి ఒక్క కంపెనీ ప్రతినిధులతో వేర్వేరుగా ఐడీబీఐ వైస్ ఛైర్మన్ చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఏ కంపెనీ ప్రతినిధులు మిల్లు పునరుద్ధరణకు (మిగతా 7లో)

నిదానానికే నీరసం.. నిర్లక్ష్యానికి నిదర్శనం



- ఇదీ నంబాల ప్రాజెక్టు దుస్థితి
- ఎనిమిది సంవత్సరాలుగా సాగుతున్న నిర్మాణం
- ఎవరికి అక్కరకు రాని రూ.10 కోట్ల ఖర్చు
- రూ.8 కోట్ల నుంచి రూ.26 కోట్ల వరకు పెరిగిన నిర్మాణ వ్యయం

నంబాల ప్రాజెక్టు వద్ద నిర్మించిన అలుగు

ఆసిఫాబాద్ ✍, రెబ్బెన, న్యూస్‌టుడే

వరుణుడి కరుణా కటాక్షంతో ఏటా ఈ సమయంలో వరి పంటలతో పచ్చగా ఉండే నంబాల ప్రాంతం ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఒక్క పంట లేక పొలాలన్నీ కళావిహీనంగా మారాయి. తొమ్మిది గొలుసుకట్టు చెరువుల్లో చుక్కనీరు లేక వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు ప్రశ్నార్థకంగానే మిగిలింది. సమీపంలోని పరవళ్లు తొక్కే వాగు నీటిని ఒడిసి పట్టి కాలువల ద్వారా సాగు భూములను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 2009 సంవత్సరంలో నంబాల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. నేటికీ పనులు నిదానానికే నీరసంలా కొనసాగడం, కాలువల పనులు ప్రారంభమే కాకపోవడం వల్ల అన్నదాతలు ఉసూరుమంటున్నారు. మరోవైపు గుత్తేదారు, అధికారుల మిలాఖత్‌కు నిదర్శనంగా నిర్మాణం వ్యయం సైతం నాలుగింతలకు చేరుకోవడం, ఎలాంటి ప్రయోజనం లేని అలుగును రూ.కోట్ల వ్యయంతో నిర్మించి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్న అధికారుల వైఖరితో కర్షకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు సమగ్ర స్వరూపం

ప్రాజెక్టు మంజూరైంది	2009లో
కేటాయించిన నిధులు	రూ.8.17 కోట్లు
ప్రస్తుతం కేటాయించిన నిధులు	రూ.26 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పనులు	48 శాతం
వెచ్చించిన వ్యయం	రూ.9 కోట్లు.
అవసరమైన భూమి	218 ఎకరాలు
సేకరించింది	54 ఎకరాలు

రెబ్బెన మండలంలోని నంబాల పంచాయతీకి సమీపంలో గంగాపూర్ వాగుపై 2009 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.8 కోట్ల వ్యయంతో స్పిల్‌వే నిర్మాణంతో (మిగతా 7లో)

జానపదం ఘల్లుమంది..



జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు బుధవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. విద్యార్థులు తమ నృత్యంతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మహ్మద్ రఫీక్ పాల్గొన్నారు.

వివరాలు.. లోపలి పేజీలో..

అన్నదాతకు అండగా...





- 9లోగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో రైతు సమితుల ఏర్పాటు
- మొదలైన కసరత్తు
- పెట్టుబడిసాయం.. మార్కెటింగ్ కోసం..

ఆదిలాబాద్ వ్యవసాయం, ఈనాడు-ఆదిలాబాద్

వచ్చే ఏడాది వానాకాలం సీజన్ నుంచి రైతులకు ఎకరానికి రూ.4వేలు ఇచ్చే పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు, పంట ఉత్పత్తుల అమ్మకంలో దళార్ల పాత్రను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల వారీగా రైతుల సమగ్ర సర్వే నిర్వహించిన ప్రభుత్వం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతు సమన్వయ సమితి (ఆర్ఎస్ఎస్)లను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ తొమ్మిదో తేదీలోగా రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

పెట్టుబడి సాయంగా ప్రభుత్వం వానాకాలం(ఖరీఫ్) యాసంగి(రబీ) సీజన్లలో సాగు చేసే సాధారణ, ఉద్యాన పంటలకు ఎకరానికి రూ.4వేలు చొప్పున రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు పంటసాగు నుంచి మొదలు ధరల నిర్ణయం వరకు రైతులను సంఘటితం చేసేందుకు వీలుగా ఆర్ఎస్ఎస్‌లను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే రైతు సమగ్ర సర్వే ద్వారా ఒక అంచనాకు వచ్చిన అధికారులు, రైతులు సంఖ్య, సాగు విస్తీర్ణం, పంటల సాగు తదితర వాటి వివరాలతో సమగ్రంగా ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,741 ఆర్ఎస్ఎస్‌లు

ఉమ్మడి జిల్లాలో ఉన్న రెవిన్యూ గ్రామాల వారీగా రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా మొత్తంలో 1,741 రైతు సమితులు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఇందులో భూమి ఉన్న ప్రతి రైతు సభ్యుడిగా ఉంటారు. గ్రామరైతు సమన్వయ సమితిలో 15మంది, మండల, జిల్లా సమితిల్లో 24 మంది చొప్పున సమన్వయ కర్తలు ఉంటారు. ఆర్ఎస్ఎస్‌ల ఏర్పాటుకు జిల్లాలవారీగా మంత్రులకు బాధ్యత అప్పచెప్పారు. ఈ మేరకు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు మంత్రి జోగురామన్నను, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు ఇంద్రకరణ్ రెడ్డిని ఇన్‌చార్జీగా నియమించారు. ఇన్‌చార్జులుగా నియమితులైన మంత్రులు అన్ని సమితుల సభ్యులు, సమన్వయ కర్త పేర్లను ప్రతిపాదిస్తారు. వీరు చెప్పిన వారినే నియమిస్తారు. అయితే ప్రతి సమితిలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యంతో పాటు మూడో వంతు మహిళ సభ్యులు ఉండాలి

మండల, జిల్లా సమితులు

గ్రామ రైతు సమన్వయ సమితుల ఏర్పాటు తర్వాత మండల, జిల్లా సమితులను నామినేటెడ్ విధానంలో ప్రభుత్వమే నియమిస్తుంది. పంటల ధరల విషయంలో రైతు సమన్వయ సమితులు కీలకం (మిగతా 7లో)

జిల్లాల వారీగా

- ■ రైతులు
- ■ సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
- ■ ఏర్పాటు కానున్న రైతు సమన్వయ సమితులు (ఆర్ఎస్ఎస్‌లు) (అంచనా)

జిల్లా	సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)	రైతులు	ఆర్ఎస్ఎస్‌లు
ఆదిలాబాద్	4.97	1.22,222	508
నిర్మల్	3.57	1,54,963	420
మంచిర్యాల	2.38	1,45,447	382
కుమురంభీం	3.17	97,363	420

భార్య మృతికి కారణమైన భర్తకు ll ఏళ్ల జైలు

మంచిర్యాల జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు

జన్నారం, మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామానికి చెందిన తేజావత్ భరత్‌నాయక్‌కు 11 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.వెంకటేశ్వర్లు తీర్పునిచ్చినట్లుగా జన్నారం ఎస్సై రమేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కామన్‌పల్లికి చెందిన భరత్‌నాయక్ రోటిగూడ గ్రామానికి చెందిన వసంతతో 2011లో పెళ్లి జరిగింది. వివాహ సమయంలో రూ. రెండు లక్షల నగదు, ఒక తులం బంగారం ఇచ్చారు. వారికి ఒక బాబు జన్మించాడు. అప్పటి వరకు సాఫీగా సాగిన వారి సంసారంలో ఆ తరవాత నుంచి వసంతకు వేధింపులు తప్పలేదు. అర ఎకరం భూమి, ఒక ప్లాటు, ప్రసవానికి అయినా ఖర్చు రూ. 20వేలు పుట్టింటి నుంచి తేవాలంటూ నిత్యం వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు భరించలేక 2014లో వసంత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఎస్సై బుద్దేస్వామి, మంచిర్యాల డీఎస్పీ రమణకుమార్, ఏఎస్పీ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అదనపు పీపీ నోముల రాజ్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి నిందితుడికి 11ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.



ఆర్కే-7 గని వద్ద మాట్లాడుతున్న తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు

మోసపూరిత ఒప్పందాలు చేసుకుంటే ఊరుకోం

తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: 10వ వేతన సంఘం చర్చల్లో జాతీయ సంఘాలు మోసపూరిత ఒప్పందాలు చేసుకుంటే తాము ఊరుకునేది లేదని తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని ఆర్కే-7 గనిపై ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేతన సంఘం చర్చల్లో 50 శాతం వేతనాలు సాధిస్తామన్న జాతీయ సంఘాలు 20 శాతానికే మొగ్గు చూపడం అన్యాయమన్నారు. నెలకు 16 మస్టర్లుంటేనే అండర్ గ్రౌండ్ అలవెన్సు, 18 మస్టర్లు నిండితేనే మూడు నెలల బోనస్ చెల్లించాలని యాజమాన్యం చూస్తోందని దీనికి జాతీయ సంఘాలు ఒప్పుకోవద్దన్నారు. వేతన సంఘం ఒప్పందాల్లో ఏదైనా అన్యాయం జరిగితే జాతీయ సంఘాలను సింగరేణిలో నిలదీస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అండతో సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తెబొగకాసం కృషి చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో కార్మికులు తమ సంఘాన్ని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తెబొగకాసం నాయకులు కె.వీరభద్రయ్య, సీహెచ్.అశోక్, కానుగంటి చంద్రయ్య, మోతె రాఘవరెడ్డి, ఎ.గంగయ్య, నెల్కి మల్లేష్, ఎన్.మొండయ్య, దమ్మాల శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించడం యాజమాన్యం బాధ్యత

శ్రీరాంపూర్ గ్రామీణం: భూగర్భ గనుల్లోని పని స్థలాల్లో కనీస వసతులు మరుగుదొడ్లు, శుద్ధిచేసిన తాగునీటిని అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని తెబొగకాసం మాజీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి కోటిలింగం పేర్కొన్నారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్‌లో మాట్లాడుతూ భూగర్భ గనుల్లో మూడు షిఫ్టులో కార్మికులు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నార న్నారు. గనుల నిబంధనలు 37, 38 ప్రకారం భూగర్భంలో కార్మికులు పని చేసే స్థలాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతిని కల్పించాల్సిన అవసరముందన్నారు. యాజమాన్యం దీన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. గనుల నుంచి వచ్చిన నీటిని ఫిల్టర్ చేసి మళ్లీ భూగర్భంలోకి పంపిస్తున్నారని, ఈ నీటిని తాగడం వల్ల కార్మికులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భూగర్భంలోని పని స్థలాల్లో సరిపడా గాలి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

అధికారుల వేధింపులు.. ఓవర్‌మెన్ ఆత్మహత్యాయత్నం

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిలో అధికారుల వేధింపులు తాళలేక బుధవారం ఇంటివద్ద పల్లెపాటి సత్యనారాయణ అనే ఓవర్‌మెన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మందమర్రి డిస్పెన్సరిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రిలో నివాసం ఉండే సత్యనారాయణ బుధవారం ఉదయం విధులకు రాగా అక్కడ ఉన్న కాసిపేట గ్రూప్ ఏజెంట్ నాగేశ్వర్‌రావు డిస్ట్రిబ్యూషన్ విషయమై ప్రశ్నించగా ఆరోగ్యం బాగా లేనందున ఇతర ఓవర్‌మెన్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగిందని సమాధానం ఇచ్చానన్నారు. దీంతో ఏజెంట్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటంతో మస్టర్ తొలగించుకొని ఇంటికి వెళ్లాడు. ఉత్పత్తి కోసం అనేక రకాలుగా శ్రమించి యాజమాన్యం వద్ద పేరు తెచ్చుకున్న తనని దూషించడంతో మానసికంగా ఒత్తిడికి గురై ఇంటి వద్ద ఉన్న హేర్‌డయర్ (తల వెంట్రుకలకు వేసుకునే రంగు) తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సత్యనారాయణ పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అతన్ని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఓడ్నాల రాజన్న, కనుకుల తిరుపతి, అమరగోండ రాజయ్య పరామర్శించారు.



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ

వేతన సంఘం చర్చల్లో మెరుగైన ఒప్పందాలకు కృషి

ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మిస్కె సమ్మయ్య

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: 10వ వేతన సంఘం చర్చల్లో బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేసుకునేలా తమవంతు కృషి చేస్తున్నామని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మిస్కె సమ్మయ్య పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని ఆర్కే-8 గని వద్ద ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వేతన సంఘం చర్చలు కొలిక్కి వచ్చే తరుణంలో యాజమాన్యం 7 రోజుల పని దినాలు, మూడు నెలల బోనస్‌ను మస్టర్లతో ముడిపెట్టడం వల్ల సమావేశం వాయిదా పడిందన్నారు. గురువారం జరిగే చర్చల్లో మెరుగైన ఒప్పందాలు చేసుకుంటామని, లేకపోతే సమ్మెలోకి వెళ్లేందుకు జాతీయ సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వేతన సంఘం ఒప్పందాలపై అవగాహన లేని తెబొగకాసం తమపై లేనిపోని అరోపణలు చేస్తోందని, కార్మికులు వాటిని నమ్మొద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కార్మికులు ఏఐటీయూసీని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, వెంగల బాల్‌రెడ్డి, ఈర్ల పోషం, మోతె నారాయణ, జక్కుల నారాయణ, భీమిని పోషం, చీమల రాయలింగు, పిల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన తెబొగకాసంకు గుణపాఠం చెప్పాలి

మందమర్రి, రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు సంఘంగా ఐదు సంవత్సరాల పాటు కొనసాగిన తెబొగకాసం చేసిన వాగ్దానాలు, హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆ సంఘానికి ఎన్నికల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ, సహాకార్యదర్శి భీమనాధుని సుదర్శనం పిలుపునిచ్చారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కె.కె-1 గనిపై నిర్వహించిన ద్వార సమావేశంలో వారు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం కృషి చేసే ఏఐటీయూసీకే పట్టాం కడుతారని చెప్పారు. ఈ సందర్భంగా తెబొగకాసంకు చెందిన కార్యకర్తలు, సానుభూతిపరులైన దొరిశెట్టి సత్యనారాయణ, డి.రవిందర్, బొడకుంట రాజయ్య, ఎస్.శంకర్, కె.కోమురయ్య, చారి తదితరు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు డి.సత్యనారాయణ, వెల్ది ప్రభాకర్, దేవసాని సత్యనారాయణ, అంకతి సాయిలు, వై.రాయమల్లు, లక్ష్మన్, పున్నం శ్రీనివాస్, రాజేశం, మల్లేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే-8 గని వద్ద మాట్లాడుతున్న ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి సమ్మయ్య

రామకృష్ణాపూర్‌లోని సీహెచ్ పీ పై...

మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి సీహెచ్‌పీ ఆవరణలో బుధవారం ఏఐటీయూసీ ఆవరణలో ద్వార సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం బ్రాంచి కార్యదర్శి ఎండీ.అక్బర్‌అలీ మాట్లాడుతూ.. .సింగరేణి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు తెబొగకాసం జిమ్మిక్కులు చేస్తుందన్నారు. చట్టబద్ధత లేని వారసత్వ ఉద్యోగాలను ప్రకటించిన కార్మికులను నష్టం చేసిన ఆ సంఘానికి రానున్న ఎన్నికల్లో కార్మికులు గట్టి బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామడుగు లక్ష్మన్, మిట్టపెల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆర్.వెంకన్న, పిట్ కార్యదర్శి మల్లయ్య, కొత్త గంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో అధికారుల తనిఖీ

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని కేంద్రీయ విద్యాలయాన్ని బుధవారం ఆ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. హైదరాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ పద్మావతి.. విద్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. గతేడాది కేంద్రీయ విద్యాలయం మంచిర్యాలలో ప్రారంభమైనా ఇప్పటికీ పలు సమస్యలు ఉన్నాయని 'న్యూస్‌టుడే' అధికారిణి దృష్టికి తీసుకెళ్లింది. ఇప్పటికే పాఠశాల శాశ్వత భవనం కోసం ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించిందని, నిధులు సమకూరినట్లయితే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. బోధన పరంగా విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను అమలు చేయడానికి తమ సంఘం కట్టుబడి ఉందని సింగరేణి గుర్తింపు సంఘం తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ అన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి, ఆర్కే-1ఏ గనిపై వేర్వేరుగా నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ హయంలో 20వేల మంది కార్మికులను డిస్మిస్, గోల్డెన్ హ్యాండ్‌షేక్ కింద తొలగింపుకు గురయ్యారని ఇది రెండు సంఘాల పాపమేనని పేర్కొన్నారు. తమ సంఘం గుర్తింపు హోదా పొందిన తర్వాత 10 వేల ఉద్యోగాలను కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో పిట్ కార్యదర్శులు కోడురి ఎల్లయ్య, ముద్దసాని కృష్ణ, జె.శ్రీనివాస్, ఏరియా నాయకులు పాల్గొన్నారు.

అమరవాదిలో కొండచిలువ హతం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: మందమర్రి మండలం అమరవాది గ్రామ శివారులో కోళ్లను తినేందుకు వచ్చిన కొండ చిలువను గ్రామస్థులు చంపివేశారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ శివారులోని తూటివాడ-రాజీవ్‌నగర్ మధ్యలో సంచరిస్తున్న కొండ చిలువను గుర్తించిన గ్రామస్థులు కర్రలతో కొట్టి చంపారు. రెండు మూడు రోజులుగా ఇళ్లలోని కోళ్లు మాయం కావడం స్థానికులు గుర్తించారు. ఈ నేపథ్యంలో తెల్లవారు జామున కోడిని మింగుతున్న కొండచిలువను చూశారు.



చంపివేసిన కొండచిలువను చూస్తున్న గ్రామస్థులు

సమన్వయంతో పని చేసి విజయం సాధిద్దాం

ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

రెబ్బెన, న్యూస్‌టుడే: కార్మికుల గుండెల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని, నాయకులంతా సమన్వయంతో పని చేసి బెల్లంపల్లి ఏరియాలో గులాబీ జెండా ఎగురవేద్దామని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి గోలేటిలోని తెలంగాణ భవనంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశం కోసం సైనికులు సరిహద్దుల్లో ప్రాణాలను పనయంగా పెట్టి పని చేస్తున్నారో, అదే తరహాలో ప్రకృతికి విరుద్ధంగా పని చేసే కార్మికుల కష్టాసుఖాలు తెలిసిన కేసీఆర్ హక్కులను సాధించిపెడుతాడన్నారు. తెబొగకాసంలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ, జాతీయ సంఘాల విమర్శణలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ జాతీయ సంఘాలు ఎక్కడ ఉనికి కోల్పోతామోనని తెబొగకాసంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, కార్మికులు నమ్మె పరిస్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో తెబొగకాసం ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, కేంద్ర కార్యదర్శులు మల్రాజు శ్రీనివాస్‌రావు, ఎస్.సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు ఆజ్మీర బాబురావు, సర్పంచి తోట లక్ష్మణ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు కె.శంకరమ్మ, కార్యదర్శులు రాంరెడ్డి, బి.శంకర్, మంగిలాల్, శంకరయ్య, ఎంపీటీసీ వనజ, నాయకులు ఎస్.ప్రకాష్ రావు, నారాయణరెడ్డి, రాజలింగు, సాంబగౌడ్, టీపీ రాములు, ఎస్.శంకర్, ఎం.రామారావు, కొండ సత్తయ్య, రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

ఉత్సాహం కావొద్దు.. విషాదం



వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

★ గణేష్ నిమజ్జనంలో నిర్లక్ష్యం వద్దు.. ★ అప్రమత్తతే శ్రీరామరక్ష..!

జైనూరు, న్యూస్‌టుడే :

ఊరువాడ దేశ వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వినాయక మండపాల పట్ల పూజలు, భజనలు, అన్నదానాలు, ఇలా భక్తి కార్యక్రమాలతో సందడి సంతరించుకుంటోంది. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నవరాత్రి ఉత్సవాలు సాఫీగా..ప్రశాంతంగా కొనసాగుతుండగా ఇక ఉత్సవం ముగ్గింపు దశకు చేరుకుంటున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వినాయకులను చెరువులు, నదులు, వాగుల్లో నిజమ్జనం చేయనున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'న్యూస్‌టుడే' కథనం.

నవరాత్రులు తుది దశకు చేరడంతో జిల్లా వ్యాప్తంగా నిమజ్జన ఉత్సవం కనుల పండువగా జరగనుంది. ముఖ్యంగా ఆదిలాబాద్, భైంసా, నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వినాయకునికి వీడ్కోలు పలుకుతారు. ఉమ్మడి జిల్లాలో భైంసా, ఉట్నూరు, జైనూరు ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నిమజ్జన కార్యక్రమంలో ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం ఉంటుంది. ఇప్పటి వరకు ఆనందోహాత్సవాలతో పూజలు నిర్వహించిన భక్తులు.. నిమజ్జనోత్సవమూ ఆనందంగా జరగాలంటే ఎలాంటి అపశ్రుతి కలగకుండా జాగ్రత్తలు పాటించాల్సిందే. పైగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని నదులు, చెరువులు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. గ్రామాల్లో వేలాడే తీగలు శోభాయాత్రలో యమపాశాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది.



గణేష్ నిమజ్జనం చేస్తున్న యువకులు

నిమజ్జన ప్రదేశాల్లో..

1. గణేష్ ఉత్సవాల్లో కీలకమైన ఘట్టం నిమజ్జనం. అపశ్రుతులు దొర్లకుండా ఇక్కడ అప్రమత్తంగా వ్యవహరించాలి. నదులు, చెరువులు, వాగుల వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నానీట మునిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

2. ముందుగానే నిమజ్జనానికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించుకోవాలి.

3. భారీ విగ్రహాలైతే క్రేన్‌ల సహాయంతోనే నిమజ్జనం చేయాలి.

4. నిమజ్జనం సమయంలో ఈతరాని వాళ్లు దగ్గరగా వెళ్లకూడదు.

5. ఈతలో ప్రావీణ్యం ఉన్నవాళ్లే దగ్గరలో ఉండి నిమజ్జనం పూర్తి చేయాలి. నిర్వాహకులు అందరూ ఈత వచ్చిన వారే ఉండేలా చూసుకోవాలి. నిమజ్జనం చేసే చోట బురద లేకుండా చూడాలి.

6. నిమజ్జనం చేసేచోట తగినంత వెలుగులు ఉండేలా చూడాలి. చీకటి ప్రాంతంలో నిమజ్జనం ప్రమాదకరం.

ముందే గుర్తించాలి

నిమజ్జనం చేసే ప్రాంతాలను ముందే గుర్తించాలి. నిమజ్జనం ప్రాంతం వరకు రహదారి సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రహదారి సరిగా లేకుంటే పెద్ద ఎత్తున వాహనాలు, ఎత్తున విగ్రహాలతో ప్రమాదం జరిగే అవకాశముంది. నిమజ్జనం జరిగే చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఎక్కువ మందిని నీటిలోకి పోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జనం ప్రాంతంలో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలి. గ్రామాల్లోనూ విద్యుత్తు తీగలు వదులుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

శోభయాత్రలో ఇలా..

నిమజ్జనం చేసే ప్రాంతంలో వద్దనే కాకుండా ముఖ్యంగా శోభయాత్రలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. యాత్ర జరుగుతున్న చోట పోలీసుల సహాయం తీసుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి.

1. శోభయాత్ర నిర్ణీత సమయంలో ముగిసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

2. శోభాయాత్రలో ప్రధాన ఆకర్షణ విద్యుత్తు దీపాల అలంకరణే. ఊరేగింపు సమయంలో గ్రామాల్లో విద్యుత్తు తీగలు తగిలే ప్రమాదం ఉంది. వినాయక విగ్రహాలు ఎత్తు ఎక్కువగా ఉన్న చోట విద్యుత్తు తీగతలతో జాగ్రత్తగా ఉండాలి. రెండేళ్ల క్రితం ఇంద్రవెల్లి మండలంలోని పీప్రీ గ్రామంలో చిన్నపాటి నిర్లక్ష్యమే ముగ్గురు ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనే ఇందుకు నిదర్శనం.

3. విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం సాగిస్తూ పర్యవేక్షణ చేయాలి.

4. బాణసంచాతో ముప్పు పొంచి ఉంటుంది. శోభాయాత్రలో బాణసంచా కాల్చడంతో ఏ కొద్ది నిర్లక్ష్యం జరిగినా ప్రాణాలకే ప్రమాదం.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- నాగేంద్ర. జైనూరు, సీఐ

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గణేష్ మండపాలు, ప్రధాన కూడలిలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనం చేసే ప్రాంతాలు అనుకూలంగా ఉండేలా చూడాలని మండపాల నిర్వహాకులకు ఆదేశాలిచ్చాం. నిమజ్జనం రోజునా చెరువులు, నదుల వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారి ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తున్నాం.



పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రఫీక్, తదితరులు

అలరించిన జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు బుధవారం స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా విద్యాధికారి మహ్మద్ రఫీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, జానపద, నృత్య కళారంగాల్లోనూ రాణించాలన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు త్వరలోనే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు జానపద, హరితహారం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పాటలపై చేసిన నృత్యాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ప్రోగ్రాం కన్వీనర్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ వ్యవహరించగా, న్యాయనిర్ణేతలుగా వెంకటస్వామి, గణేష్ కుమార్, శంకరయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవో బిక్షపతి, రాష్ట్ర పరీక్షల పరిశీలకుడు ఉదయబాబు, ప్రత్యేకాధికారి జబ్బార్, డీసీఈబీ వై.శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ పాఠశాలల విద్యార్థుల బృందం నృత్యాలు



ఎన్ఎంఆర్ జాబితాల్లో అక్రమాలు

- **సత్వరమే నిలిపి వేసి, సీనియార్టీ ప్రకారం భర్తీ చేయాలి**
- **పురపాలక సంఘం మంత్రి, డైరెక్టర్‌కు ఫిర్యాదు**
- **కౌన్సిల్ సమావేశంలో పలువురి అభ్యంతర పత్రం అందజేత**

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :

కాగజ్‌నగర్ పురపాలక సంఘం పరిధిలోని నాన్‌మాస్టర్ రూల్స్(ఎన్ఎంఆర్)సీనియార్టీ జాబితాను పక్కనబెట్టి, జూనియర్లకు ముడుపులు తీసుకొని శాశ్వత ఉద్యోగులుగా భర్తీ చేసేందుకు అధికారులు, పలువురు పాలకవర్గం సభ్యులు కుట్ర చేస్తున్నట్టు పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. బుధవారం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ సీపీ.విద్యావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కౌన్సిలర్లు జానీమియా, వసీమున్నిసా, వైద్యసురేఖ, శ్రావంతబాయి, పంజాల సుజాత, కె.యమున, సిడం శ్రీనివాస్, రాచకొండ గిరిష్‌కుమార్, యలమంచిలి విజయలక్ష్మి ఎన్ఎంఆర్ ఎనిమిది పర్మినెంట్ జాబితాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడి, సీనియార్టీ లేని వారిని పర్మినెంట్ చేసేందుకు జాబితా తయారు చేసి, ప్రభుత్వానికి సమర్పించినట్టు ఆరోపించారు. సత్వరమే ఆ జాబితాను నిలిపివేసి, సీనియార్టీ జాబితా ప్రకారం ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని ఆ కౌన్సిలర్లు డిసెంట్ నోట్(అభ్యంతరం)పత్రాలను వేర్వేరుగా కమిషనర్ తిరుపతికి అందజేశారు. ఈ విషయంలో అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. అధికారులు, కౌన్సిలర్లు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగ్గా, సమావేశం మధ్యలోనే ఛైర్‌పర్సన్ సమావేశం హాల్ నుంచి బయటకు వెళ్లిపోయింది.

ఈ సమావేశానికి విలేకర్లను కూడా అధికారులు అనుమతించేందుకు నిరాకరించారు. ఎన్ఎంఆర్ జాబితాల్లో అక్రమాలపై 'ఈనాడు' మీనిలో నియామకాల్లో నిబంధనలకు తిలోదకాలు' కథనం రాగా కౌన్సిలర్లు ఈ సమావేశంలో కథనంపై నిలదీస్తారనే ఉద్దేశంతోనే దినపత్రికల విలేకరులను అనుమతించలేదు.



పాలనాధికారి చంపాలాల్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

కౌన్సిలర్ల ఆరోపణ

పురపాలక సంఘం పరిధిలోని ఎనిమిది మంది ఎన్ఎంఆర్ పర్మినెంట్ జాబితాల్లో సీనియార్టీ లేని వారికి పర్మినెంట్ చేస్తూ జాబితా తయారీలో పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ భర్త సీపీ.రాజ్‌కుమార్, పలువురు కౌన్సిలర్ల హస్తం ఉందని, పర్మినెంట్ చేసే వారి నుంచి భారీ ఎత్తున ముడుపులు తీసుకొని, ఈ జాబితాను తయారు చేసినట్టు కౌన్సిలర్లు జానిమియా, గిరిష్‌కుమార్‌లు ఆరోపించారు. సత్వరమే ఈ జాబితాను రద్దు చేసి, సీనియార్టీ ప్రకారం అర్హులైన ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని డిమాండు చేశారు. ఈ మేరకు మున్సిపల్ డైరెక్టర్, మంత్రి, జిల్లా పాలనాధికారికి ఈ జాబితాల్లోని అక్రమాలపై ఫిర్యాదు చేస్తామన్నారు. అంతే కాకుండా ఒప్పంద కార్మికుల టెండరు ప్రక్రియ తీవ్రంగా జాప్యం చేస్తూ గుత్తేదార్లుతో అధికారులు, పలువురు పాలకవర్గం సభ్యులు కుమ్మక్కై లక్షల రూపాయాలు దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు, ఈ గుత్తేదారు బిల్లు చెల్లింపు నిలిపివేసి, సత్వరమే టెండర్లు నిర్వహించాలని ఈ విషయంలోనూ సమావేశంలో డిసెంట్ నోట్ అందజేశామన్నారు. సమావేశం పూర్తి కాకుండా, ఛైర్‌పర్సన్ సమావేశం హాల్ నుంచి వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో ఏ అంశంపై కూడా చర్చ జరగలేదన్నారు. సత్వరమే ఈ అజెండాను పూర్తిగా రద్దు చేసి, సత్వరమే మరో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు వైద్య సురేఖ, శ్రావంతబాయి, పంజాల సుజాత, యమున, సిడం శ్రీనివాస్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై పాలనాధికారికి ఫిర్యాదు

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పురపాలక సంఘం పరిధిలోని ఎనిమిది మంది ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేసేందుకు తయారు చేసిన జాబితాల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్టు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం రాత్రి జిల్లా పాలనాధికారి చంపాలాల్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ భర్త సీపీ.రాజ్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు కుమ్మక్కై లక్షల రూపాయాలు ముట్టజెప్పిన సీనియార్టీ లేని ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ జాబితాల్లో చేర్చినట్టు ఫిర్యాదు చేశారు. సీనియార్టీ జాబితాల్లోని వివరాలను సైతం పాలనాధికారికి అందజేశారు. స్పందించిన పాలనాధికారి సత్వరమే కాగజ్‌నగర్ ఆర్డీఓ రమేష్‌బాబు విచారణ అధికారిగా నియమించి, ఎన్ఎంఆర్ పర్మినెంట్‌లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. విచారణ జరిగినట్టు తేలితే సత్వరమే ఆ జాబితాను నిలిపివేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని కౌన్సిలర్లుకు జిల్లా పాలనాధికారి భరోసా ఇచ్చారు.

ఆసిఫాబాద్

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

జైనూరు, న్యూస్‌టుడే : మండలంలోని రాశిమెట్ట, జైనూరు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు గురువారం నిర్వహిస్తున్నట్లు స్కూల్ కాంప్లెక్స్ ఎస్ఈ ఆర్పీలు ఉయిక శంకర్, దుర్వ గంగారంలు పేర్కొన్నారు. మండలంలోని ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ఏకోపాధ్యాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఎస్జీటీలు, సీఆర్టీలు మధ్యాహ్నం 2 గంటలకు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు. పాఠశాలకు సంబంధించిన పూర్తి నివేదికలు తీసుకురావాలని సూచించారు.

నేడు దబోలికి జిల్లా పాలనాధికారి రాక

జైనూరు, న్యూస్‌టుడే : మండలంలోని దబోలి గ్రామ పంచాయతీ పరిధిలోని జాడుగూడ, శేఖుగూడ గ్రామాల్లో గురువారం జిల్లా పాలనాధికారి చంపాలాల్ రానున్నట్లు ఎంపీడీఓ బానొత్ దత్తారావు, ఉపాధి హామీ ఏపీఓ బాలయ్యలు పేర్కొన్నారు. ఆయా గ్రామాల శివారు ప్రాంతంలో హరితహారం కార్యక్రమంలో ఉపాధి హామీ, అటవీశాఖ ఆధ్వర్యంలో భాగంగా 4 వేల మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటనున్నట్లు వారు పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, న్యూస్‌టుడే : బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సుల కోసం మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా డీజీఎం(పర్సనల్) జె.కిరణ్ తెలిపారు. రెబ్బెన మండల కేంద్రంలో టైలరింగ్, గోలేటిలో బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్ కోర్సులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల మహిళలు వచ్చే నెల 4వ తేదీలోపు గోలేటి జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మొక్కలు నాటుతున్న ఆదివాసీలు

ఉత్సాహంగా హరితహారం

కెరమెరి: మండలంలోని ధనోర కొలంగూడ, గోండ్‌గూడ, శివగూడ గ్రామాలలో బుధవారం రాయి సెంటర్ రాంజీగూడ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా ఇంటి ఆవరణం, ఆంగన్‌వాడీ కేంద్రాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సార్‌మెడి కనక ప్రభాకర్ మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాన్ని కాపాడాతాయని, వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా సార్‌మెడి బాధ్యతలు స్వీకరించినందున ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చహకటి మారు, మడావి కేశవ్, సిడాం గంగు, రావుజీ పటేల్, రాజుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పాలనాధికారి చంపాలాల్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో టీడబ్ల్యూ సీఆర్టీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్మెంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో 12 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టీడబ్ల్యూ సీఆర్టీ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు సురేష్, సుభాంగి, సహాయ కార్యదర్శులు గణపతి, తిరుపతి, కోశాధికారులు హిరామన్, గజానంద్, సభ్యులు నాగోరావ్, వసంత్, ఉదయశ్రీ, రాజశ్వేరి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు జైళ్ల శాఖ డీజీపీ రాక

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆసిఫాబాద్ పట్టణం జంకాపూర్‌లో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి జైళ్ల శాఖ డీజీపీ వినయ్ కుమార్ సింగ్ గురువారం సాయంత్రం హాజరుకానున్నట్లు ఆసిఫాబాద్ స్పెషల్ సబ్ జైల్ పర్యవేక్షకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అర్చకుడు నాగేశ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఆలయ ప్రముఖులు కాండ్రె కిషన్, చంద్రమోహన్, వినయ్, శ్యామ్, సుదర్శన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ

- తగ్గిపోతున్న నిత్యావసర సరకుల పంపిణీ
- పేదలపై ఆర్థిక భారం



చౌక దుకాణంలో బియ్యం పంపిణీ

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే

నిరుపేదలకు చౌక ధరల్లో నిత్యావసర సరకులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌక దుకాణాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. తెల్ల రేషన్ కార్డుదారులకు దుకాణాల్లో పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. గతంలో బియ్యం. ..పప్పులు.. పంచదారతో సహా తొమ్మిది రకాల సరకులను పంపిణీ చేసేవారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సరకుల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలుగా చౌక దుకాణాల్లో పంచదార సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం కేవలం బియ్యం, కిరోసిన్ మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో నిరుపేదలు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారు. బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి నిత్యావసర సరకులు కొనుగోలు చేయలేకపోతున్నారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు

నేటికీ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు రేషన్ సరకుల మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చాలా మంది పేదలకు రేషన్ సరకులు కొండంత అండగా ఉండేవి. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు భిన్నంగా రాను రాను ప్రజా పంపిణీ వ్యవస్థ నీరు కారిపోతోంది. గతంలో చౌక దుకాణాల్లో కంది పప్పును కిలో రూ.50కు అందించేవారు. అప్పుడు బహిరంగ మార్కెట్‌లో దాని ధర రూ.120కు వరకు ఉంది. అరకిలో పంచదారను రూ.7.50కు అందించేవారు. మార్కెట్‌లో కిలో పంచదార ధర రూ.42 వరకు ఉంది. గతంలో కిరోసిన్‌ను కార్డుపై 2 లీటర్లు ఇవ్వగా ఇప్పుడు 1 లీటరు మాత్రమే ఇస్తున్నారు. ఇలా మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పేదలకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీంతో పేదలు ఆర్థిక భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చౌక దుకాణాల్లో అన్ని రకాల సరకులు అందేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

★ నియోజకవర్గంలోని 8 మండలాల్లో దాదాపుగా 130 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 62,732 కుటుంబాలకు ఆహారభద్రత కార్డులుండగా 2.36 లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారు. మూడు నెలల క్రితం బియ్యం, చక్కెర, పప్పులు, గోధుమలు, సబ్బులు, ఉప్పు, కారం, సర్ఫ్, కిరోసిన్ వంటి సరకులు పంపిణీ చేశారు. గత మూడు నెలలుగా బియ్యం, కిరోసిన్ తప్ప మిగితా సరకులను పంపిణీ చేయడం లేదు. నిత్యావసర సరకులను మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ సరకుల్లో క్రమేణా కోత విధిస్తుండటంతో అరకొరగా అందే కమీషన్‌తో రేషన్ డీలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఆందోళనలో రేషన్ డీలర్లు

గతంలో చౌక దుకాణాల్లో పలు రకాల సరకులను పంపిణీ చేయడం వల్ల డీలర్లకు సుమారు రూ.5వేల వరకు కమీషన్ వచ్చేది. ఇప్పుడు బియ్యం మాత్రమే ఇస్తుండడంతో వారి పరిస్థితి గందరగోళంలో పడింది. తక్కువ రేషన్ కార్డులున్న చౌక దుకాణాల్లో డీలర్లకు రూ.2000 మించి కమీషన్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు.

నియోజకవర్గంలోని చౌక దుకాణాల వివరాలు....

మండలం	మొత్తం కార్డులు	లబ్ధిదారులు
ఆసిఫాబాద్	14684	51315
జైనూర్	7676	31323
కెరమెరి	8248	32580
లింగాపూర్	3153	13662
రెబ్బెన	9262	31623
సిర్పూర్(యు)	3938	18059
తిర్యాణి	6602	23070
వాంకిడి	9169	34371

అన్ని సరకులు అందించాలి

- గంగమ్మ, లబ్ధిదారులు, రాజంపేట్, ఆసిఫాబాద్



చౌక దుకాణాల్లో నిత్యావసర వస్తువులన్నింటినీ పంపిణీ చేయాలి. మార్కెట్‌లో సరకుల ధరలు పెరిగిపోవడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకునేందుకు చౌక దుకాణాల ద్వారానే అన్ని సరకులు అందజేయాలి. బియ్యం ఒక్కటే ఇస్తే బతకలేం. నూనె, పంచదార, పప్పు, దినుసులు కూడా అందజేయాలి. లేకపోతే పేద కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు.

అధిక ధరలతో కొనే పరిస్థితి లేదు

- రుమిలా, గృహిణి, ఆసిఫాబాద్



తెల్ల కార్డుతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మాకు నిరాశే మిగిలింది. గతంలో తెలుపు కార్డుపై 9 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేసేవారు. కానీ ఇప్పుడు బియ్యం, కిరోసిన్ తప్ప ఇతర సరకులు పంపిణీ చేయడం లేదు. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకులు తీసుకొనే పరిస్థితి లేదు. పేదలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 9 రకాలు నిత్యావసర సరకులు పంపిణీ చేయాలి.

ఆర్థిక భద్రత కల్పించాలి

- రేగుంట కేశవరావు, రేషన్ డీలర్, అంకుసాపూర్, ఆసిఫాబాద్



కొన్నేళ్లుగా రేషన్ డీలర్‌గా పని చేస్తున్నా. ఎక్కువ సరకులను పంపిణీ చేస్తే అదే స్థాయిలో కమీషన్ కూడా ఎక్కువగా వస్తుంది. గతంలో అన్ని సరకుల మీద నెలకు రూ. 5 నుంచి 6 వేలు వచ్చేది. ఇప్పుడు సరకులు పూర్తిగా తగ్గడంతో నెలకు రూ. 2000 వరకు రావడం కష్టంగా ఉంది. దీంతో బతుకు భారంగా మారింది. మాకు వచ్చే కమీషన్ ద్వారానే కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి చౌక దుకాణాల ద్వారానే అన్ని సరకులను పంపిణీ చేయాలి. డీలర్లకు భరోస కల్పించాలి. కమీషన్ కాకుండా కనీస వేతనం చెల్లించాలి.

పాఠకుల కోసం పూలాజీబాబా జీవిత చరిత్ర పుస్తకాలు

★ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవ్‌రావు

జైనూరు, న్యూస్‌టుడే : సమాజ హితం కోసం పరితపించే ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా జీవిత చరిత్ర పుస్తకాలను విజ్ఞాన సమాచారం అందించే గ్రంథాలయాల్లో అందుబాటులోకి ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పట్నాపూర్‌లో జరిగిన పూలాజీబాబా 93వ జన్మదిన వేడుకల్లో పాల్గొని బాబా ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పూలాజీ బాబా జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవ్‌రావుకు తన జీవితచరిత్ర పుస్తకంతో పాటు అధ్యాత్మిక సందేశం గల పుస్తకాలను అందజేశారు. ఆయన వెంట ఆంద్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, స్థానిక సర్పంచి ఇంగ్లే అనసూయ దేవురావు, జాడి రవీందర్, డుక్రె సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రాల్లో పులాజీబాబా జన్మదినం

వాంకిడి: మండలంలోని ఇంధాని, నార్లాపూర్, సరాండి, నవెగూడ ధ్యాన కేంద్రాల్లో బుధవారం సద్గురు పులాజీ బాబా జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులాజీ బాబా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ప్రత్యేక భజన కార్యక్రమాలు చేపట్టారు.



జీవిత చరిత్ర పుస్తకాన్ని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌కు అందజేస్తున్న పూలాజీబాబా



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సీఐ నాగేంద్ర, న్యాయవాది జగన్

పీహెచ్‌సీలో రోగులకు పండ్ల పంపిణీ

జైనూరు, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక గురువు సద్గురు పూలాజీబాబా 93వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గరీబ్ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగేంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు న్యాయవాది బానొత్ జగన్, అసంస్థ అధ్యక్షుడు రాఠోడ్ గణేష్, వైద్యాధికారులు శ్రీనివాస్, జాధవ్ వివేక్, ఉపేందర్, రాహుల్, చందు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వాంకిడి: నిత్యం యోగా సాధన చేయడం మూలంగా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పతాంజలి యోగా జిల్లా ప్రచారక్ డొడ్డాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శారదా విద్యానికేతన్, సాయిగోపాల విద్యా మందిర్, అర్జుగూడ ప్రాథమిక పాఠశాలల్లో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలపై శిక్షణనిచ్చారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా సామూహిక సెలవు

సిర్పూర్(యు), న్యూస్‌టుడే : సీపీఎస్‌కు వ్యతిరేకంగా అన్ని జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు సెప్టెంబర్ 1న సామూహిక సెలవులో భాగంగా ఈవోపీఆర్డీ కొడప ఆనంద్‌రావుకు సిర్పూర్(యు), లింగాపూర్ పంచాయతీ కార్యదర్శులు సెలవు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన సీపీఎస్ రద్దు ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్ని తమ గొంతుకను ప్రభుత్వానికి వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజు, రాజన్న, మోబిన్, బాపురావు, సురేష్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్ పట్టణం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ విజయకాంత్‌కు కార్యాలయ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. బుధవారం స్థానిక కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సాయి వివేక్, రోహినీత్, విజయ్, కిషన్, సహేరబాను ఉన్నారు.

కెరమెరి: సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట నిర్వహించ తలపెట్టిన పింఛను విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వివిధ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్‌యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విజేష్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో భారత్‌రావు, రాజు, సత్యనారాయణ, దివ్యశ్రీ, కైలాష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టే ఉద్యమానికి ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏ.నవీన్ రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ఎస్.సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌లు ఉన్నారు.

వాంకిడి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండుతో వచ్చే నెల ఒకటిన జిల్లా పాలనాధికారి కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమిత్‌నాయక్, సోయం ఇందూరావులు కోరారు. ఆ రోజు ఉపాధ్యాయులంతా సామూహిక సెలవులు పెట్టి ధర్నాకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆసిఫాబాద్: సీపీఎస్ రద్దు కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పీఆర్‌టీయూటీఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బుధవారం సామూహిక సెలవు పత్రాన్ని జిల్లా విద్యాధికారి రఫీక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కల్గించే సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు సంఘం తరపున పోరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గోవింద్‌రావు, సభ్యులు గణేష్ కుమార్, సత్యనారాయణ, శంకరయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, సత్యనారాయణ స్వామిలు ఉన్నారు.


ఈవోపీఆర్డీకి సెలవు పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తిర్యాణి: సీపీఎస్ రద్దు చేయాలని టీయుటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న సాముహికంగా సెలవు మంజూరు చేయాలని బుధవారం ఎంఈవో ఎన్.శంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీయుటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలని, పాత విధానం కొనసాగించాలని డిమాండ్‌తో ఉపాధ్యాయులందరూ సెలవు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీయూటీఎఫ్ నాయకులు పోచన్న, బానేష్, భాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యార్థులను పనులకు పంపిస్తే చర్యలు'

ఆసిఫాబాద్: విద్యార్థులను చేను, కూలీ పనులకు పంపించడం చేస్తే తల్లిదండ్రులు చట్టపరంగా శిక్షార్హులని తహసీల్దార్ పరిమల్ బౌమిక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంకుసాపూర్ తేలిగూడ ఎంపీయూపీఎస్‌లో ఎస్ఎంసీ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుని అధ్యక్షతన నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహం కూడా నేరమన్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలచే పనులు చేయించే వారి వివరాలు మా దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో సీడీపీఓ రాజేశ్వరి, గ్రామస్థులు కేశవరావు, పాఠశాల హెచ్ఎం రమేశ్, ఎస్ఎంసీ ఛైర్మన్ పత్రు ఉపాధ్యాయులు, శంకర్, ధన్‌రాజ్, ప్రవీణ్, మాధవిలత, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ బౌమిక్

నేడు నియోజకవర్గస్థాయి తెరాస కార్యకర్తల సమావేశం

జైనూరు, న్యూస్‌టుడే : ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి తెరాస సమావేశం ఈ నెల 31న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవ్‌రావు పేర్కొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తెరాస పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు ఉదయం 11 గంటలకు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యురాలు కోవలక్ష్మితో పాటు ఎమ్మెల్సీ పురాణం సతీష్ హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు.


తిర్యాణి : గిన్నెధరి లచ్చుగూడలో గణేష్ నిమజ్జనం శోభయాత్ర

ఘనంగా గణేష్ నిమజ్జనం

తిర్యాణి, న్యూస్‌టుడే : తిర్యాణి మండలం గిన్నెధరి లచ్చుగూడలో బుధవారం గ్రామస్థులు ఘనంగా గణేష్ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు గణేష్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెందోర్ సకారాం, గెడాం పోచిరాం, పర్చాకి మాధవరావు, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండళ్ల వద్ద పూజలు

తిర్యాణి: తిర్యాణి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకొంటున్నారు. బుధవారం వినాయకుల ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ ఆవరణ, రైస్‌మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

కెరమెరి, న్యూస్‌టుడే : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో నగేష్ మాట్లాడుతూ నర్సరీలలో మిగిలిన మొక్కలను అర్హులైన లబ్ధిదారుల పొలాలలో నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. స్వచ్ఛ భారత్ గ్రామీణ పథకంలో భాగంగా చేపట్టిన మరుగుదొడ్ల సర్వేను వచ్చే నెల 2లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ అంకుస్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రులు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని లక్ష్మీ గణపతి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌక్‌లోని స్వామి వివేకానంద గణేష్ మండలి వద్ద మట్టివినాయకుడికి జరిగిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మంగ, భాజపా మండలాధ్యక్షుడు కాంద్రె విశాల్, వాంకిడి అధ్యక్షుడు దీపక్ తదితరులు పాల్గొన్నారు. పైకాజీనగర్‌లోని శ్రీసాయి గణేష్ మండలివద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అంబేద్కర్ చౌక్‌లో మట్టివినాయకుడిని దర్శించుకున్న ప్రముఖులు

బూరుగూడలో..

మండలంలోని బూరుగూడలోని శివ గణేష్ మండలి వారు నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు అరిగెల నాగేశ్వర్‌రావు, సర్పంచి కాశయ్య, ప్రముఖులు వెంకటేశం, ప్రసాద్, గణేష్, జగన్, తుల సీరామ్, బాలకిషన్‌లు పాల్గొన్నారు..

సామాజిక సేవలో ముందుండాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్లు సామాజిక సేవలో ముందుండాలని ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి గజ్జెల మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.శ్రీనివాస్‌రావు, అధ్యామపకులు సతీష్, ఆత్మారాం, నాయిని శ్రీనివాస్, హరిదాస్, రామకృష్ణ, స్రవంతి, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్

EENADU CLASSIFIEDS

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ ప్రై॥ ✆ 95818 85278.

EDUCATION

ప్రీప్రైమరి టీచర్ ట్రైనింగ్ (PPTT), నర్సరీ టీచర్ ట్రైనింగ్ (NTT), ఇంటర్, 10th చదివిన వారు అర్హులు. ప్రభుత్వ ఆమోదితం ఆడ్మిషన్ కొరకు సంప్ర॥ శ్రీ విజేత ఆకాడమీ, మంచిర్యాల- 90595 75308.

REAL ESTATE

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లా ప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యునిటీలో 2BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, సంప్ర: Hyd. అశోక్ ✆ 77020 16545.

LAND FOR SALE

మంచిర్యాల జిల్లా, భీమిని (మం), రాంపూర్ శివారులో 5 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మబడును. రాంపూర్ ప్రాజెక్ట్ క్రింద కెనాల్ సౌకర్యం కలదు. వాటర్ సోర్స్ కలదు. సంప్ర॥ 80965 84583, 91825 06428.

PLOT FOR SALE

మైనేని డవలపర్స్ వారి తెలంగాణ తిరుపతి యాదగిరి గుట్టకు ఆనుకొని DTCP అప్రూవ్డ్ గే॥ కమ్యూనిటీ లే అవుట్‌లో ప్లాట్లు 75 % లోన్ స్పా॥రి॥ & EMI's ✆ 7396241418

JOBS

AADHAR Enrollment Work: Required Qualified Operators/ Supervisors in A.P & T.S ✆ 9334395471/ 9608247907. Mail: aadhaarutl@gmail.com

జీతం: 8000-15000 వరకు ఉచితవసతి భోజనం చదువున్న లేకున్న ఉచిత నర్సింగ్ ట్రైనింగ్ ఇచ్చి స్త్రీ/పులకు నర్సింగ్‌కేర్ జాబ్ చూపించబడును. 9966310431/ 9010137634.

జగదాంబ హోండ షోరూంలో పనిచేయుటకు Sales Executives-5, Tally Accountent-3, Helper's-5, Sr. Technician's-3, Asst Mechanic-3 అనుభవం కల్గిన వారికి ప్రాధాన్యత, మంచిర్యాల. సెల్: 98491 13133.

HBCOలో ఉద్యోగావకాశాలు వయస్సు 18- 26 సం॥లోపు Qly-10th to డిగ్రీ/ MBA, (గ్రామీణ నిరుద్యోగులకు). జీతం: శిక్షణలో 6,000/- తర్వాత 25,000 వరకు ఉచిత వసతి కలదు. Cell: 95050 53401, 70325 33707.

మా సెక్యూరిటీ సంస్థ యందు హైదరాబాద్‌లో పనిచేయుటకు సె॥సూ॥వైజర్స్, సె॥గార్డ్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. ✆ 9246663777/ 903001313

ఫీజులేదు: Hydలోని ప్రముఖ లిమిటెడ్ కంపనీలకై హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్ సూ॥వై॥ కా॥ జీ. 13-18 వేలు రూం+మీల్స్ ఫ్రీ చదువు లేకున్న స్పాట్‌జాయినింగ్ ✆ 9573014079.

ఫీజులేదు Hyd లో ప్రముఖ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూ॥వైజర్స్ కా॥ జీ: 13-18 వేలు రూం + భోజనం ఫ్రీ. ESI + PF చదువు లేకున్నా జాబ్, ✆ 7330250599.

WANTED JOB

T.S లో SHARA గ్రూప్ ఆఫ్ కంపెనీకి కొత్త జిల్లాలో పర్మినెంట్ ఉద్యోగాలు. నో ఫీజు, ఫ్రీ రూం, అ. 10th, Inter. వ. 18 to 26 సం॥లోపు స్త్రీ/పు సంప్ర॥. 79811 66439, 70363 08141.

ACCOUNTING

Tally GST Suvidha Providers For GST Registrations And Services - Tally ERP9 Training With GST Implementation - Tally Software Sales Services: Vasishta Solutions Opp: RBHV School Chennur Road, MANCHERIAL Contact: 9652328568, 7093724996.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

వాంకిడి, న్యూస్‌టుడే : మానవ మనుగడకు మొక్కలతో ఎంతో ముడి పడి ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలను నాటాలని కుమురం భీం జిల్లా పాలనాధికారి చంపాలాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంధాని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి సామూహికంగా మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెట్లు నరకడం మూలంగా అడవులు నశించి పోయి పర్యావరణం దెబ్బతింటోందన్నారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫర్నీచర్ కోసం తన నిధుల నుంచి రూ. లక్ష మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైన దృష్ట్యా తన నిధుల నుంచి రూ. 60వేలు మంజూరు చేస్తానని మిగతా నిధులు గ్రామపంచాయతీ నిధుల నుంచి వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్పంచి కొట్నాక విజయ్‌కి సూచించారు. ఆర్‌అండ్‌బి రహదారి నుంచి ఇంధాని వరకు అధ్వానంగా తయారైన రహదారికి మరమ్మతులు జరిపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. హరిత హారం కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రధాన్ పురోహిత్ సేవా సంఘం సభ్యులు చేసిన సంప్రదాయ నృత్యం పాలనాధికారిని ముగ్ధుల్ని చేసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం ఆర్తిక, జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ అర్జున్‌పవార్, ఎంఈఓ మానుకుమార్, ఏపీఓ మల్లయ్య, సీడీపీఓ రెబ్కా, సర్పంచి విజయ్, ఎంపీటీసీ సభ్యుడు శ్యాంరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబాష్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంధానిలో మొక్కను నాటుతున్న జిల్లా పాలనాధికారి చంపాలాల్, తదితరులు

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం: డీఎస్పీ

తిర్యాణి: వాతావరణ సమతుల్యతకు, మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం అని ఆసిఫాబాద్ డీఎస్పీ హబీబ్‌ఖాన్ అన్నారు. బుధవారం తిర్యాణి మండలం గిన్నెధరి సబ్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో డీఎస్పీ మొక్కలు నాటారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సాముహికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకం పోలీసులు కూడా భాగస్వాములు అయినట్లు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో 5 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ణయించగా, నేటి వరకు మూడున్నర లక్షలు మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెబ్బన సీఐ మదన్‌లాల్ మాట్లాడుతూ గిన్నెధరి సబ్‌స్టేషన్‌లో ఆరు వందల మొక్కలు నాటామని వీటి రక్షణకు వెదురు కంకలతో రక్షణ కంచెలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బీ. శ్రీనివాస్, గిన్నెధరి సర్పంచి ఆత్రం నేతిబాయి, గిన్నెధిరి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారావు, కేశవరావు, విజయ్‌రావు, గ్రామపటెళ్లు వల్కా దర్మరావు, వల్కా అనంతరావు, గెడెం పోచ్చిరావు, కృష్ణ, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న డీఎస్పీ హబీబ్‌ఖాన్, సీఐ మదన్‌లాల్, ఎస్‌ఐ శ్రీనివాస్ విద్యార్థులు



గిన్నెధరి సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

● జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్

జైనూరు, న్యూస్‌టుడే : వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి 19 మంది గిరిజన రైతులు పట్టా మార్పిడి, పేర్ల సవరణ చేపట్టాలని కోరుతూ విన్నవించారు. గిరిజనేతర రైతులు తాము సాగు చేస్తున్న భూములకు పహాణీ పత్రాలు ఇవ్వాలని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అశోక్‌కుమార్ మాట్లాడారు. భూ ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే వ్యవసాయాధికారులతో పాటు రెవెన్యూ అధికారులు ఇంటింటికీ వెళ్లి రైతుల వివరాలు సేకరిస్తున్నప్పటికీ జటిలమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి చక్కని వేదికగా నిలుస్తుందన్నారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర రైతులకు పహాణీ పత్రాలు ఇవ్వడం నిలిపివేశామన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో భూప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక కృషి చేసిన తహసీల్దార్ శంకర్‌గౌడను అభినందించారు. ఆర్డీఓ కదం సురేష్, తహసీల్దార్ శంకర్‌గౌడ, ఆర్‌ఐ బాబుసింగ్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత ఖేల్‌కూద్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా నర్సారావు పేటలో జరిగిన క్షేత్రస్థాయి ఖేల్‌కూద్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అఖిల భారత స్థాయి పోటీలకు ఎంపికైన ఆసిఫాబాద్ సరస్వతి శిశుమందిర్ పదో తరగతి విద్యార్థులు రంగు వెంకటేశ్, మొహర్లె గణపతిలకు బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సరస్వతి విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి పసర్తి మల్లయ్య ఈ విద్యార్థులకు జ్ఞాపిక, ధ్రువ పత్రాలు అందజేసి అభినందించారు. క్యారమ్స్ డబుల్స్ విభాగంలో ఈ విద్యార్థులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జట్లతో తలబడి ప్రథమ స్థానంలో నిలవడం జిల్లాకే గర్వకారణమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు తర్ఫీదు, ప్రోత్సాహం అందిస్తున్న ప్రబంధకారిణి, ఆచార్యుల బృందాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుర్రాల వెంకటేశ్వర్లు, పాఠశాల కార్యదర్శి అక్కు విజయ్‌కుమార్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్, ఆచార్యులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

దానాపూర్‌కు విద్యుత్తు వెలుగులు

● సెప్టెంబర్‌లో విద్యుత్తు సరఫరా

ఆసిఫాబాద్ (✍)

దశాబ్దాలుగా విద్యుత్తు లేకుండా అంధకారంలో మగ్గుతున్న దానాపూర్ ప్రజల కష్టాలకు 'చీకటి బతుకులు' శీర్షికన ఈనాడు వెలుగులోకి తీసుకురాగా, విద్యుత్తు అధికారులు స్పందించారు. 3.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇప్పల్‌నవేగాం గ్రామం నుంచి దానాపూర్‌కు విద్యుత్తు లైన్ వేయనున్నట్లుగా ఏఈ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. 80 విద్యుత్తు స్తంభాలు బిగించనున్నట్లుగా, ఇందుకు రూ. 8 లక్షల వ్యయం చేయనున్నట్లుగా పేర్కొన్నారు. సోమవారం నుంచి పనులు ప్రారంభమవుతాయని, 20 రోజుల్లో విద్యుత్తు లైన్ పనులు పూర్తి చేసి, సెప్టెంబర్ చివరి వారంలో విద్యుత్తు సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు. దీంతో గ్రామంలో ఉన్న 265 మంది ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



మంగళహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

రెబ్బెన, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం రెబ్బెనలోని నవయుగ గణేష్ మండలి వద్ద ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు భక్తి భావంతో ముందుకు వెళ్లాలన్నారు. యువత సన్మానమార్గంలో పయనించినప్పుడే ఆలయాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఆజ్మీర బాబురావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు కుందారపు శంకరమ్మ, నవయుగ కమిటీ అధ్యక్షుడు కొయ్యాడ రాజగౌడ్, నాయకులు మోడెం సుదర్శన్‌గౌడ్, నవీన్ జైశ్వాల్, ఎం. చిరంజీవిగౌడ్, బి. శ్రీధర్, వినద్‌జైశ్వాల్, వెంకటేశ్వరగౌడ్, మడ్డి శ్రీనివాస్‌గౌడ్, భరద్వాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం నాగరాజు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక భాజపా మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టాండ్ ఆఫ్ ఇండియా పథకంతో ఎస్సీ, బీసీ నిరుద్యోగులు సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చున్నారు. దళితులకు ఆరోగ్య క్యాంపులు, సన్మానం చేయ్యాలని భాజపా ఎస్సీ మోర్చా కమిటీ తీర్మానం చేశారు. కార్యక్రమంలో భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంటేంకి భీంరావ్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఖాండ్రే విశాల్, వాంకిడి అధ్యక్షుడు దీపక్ ముండే, నాయకులు విజయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం చర్చల్లో పురోగతి



చర్చల్లో కార్మిక ప్రతినిధులు

(మొదటిపేజీ తరువాయి) ఆసక్తి చూపారో ఆ కంపెనీ ప్రతినిధులతో మరో విడత ఐడీబీఐ ఆధ్వర్యంలో ముంబాయిలో చర్చలు జరిపి, ఐడీబీఐ ఆధ్వర్యంలో ఎస్పీఎం బహిరంగ వేలం వేసి, ఆ కంపెనీ ప్రతినిధులకు మిల్లు పునరుద్ధరణకు అప్పగించే యోచనలో ఉన్నట్టు తెలిసింది. 2014 సెప్టెంబరు 27న షెట్‌డౌన్ పేరిట కాగితం ఉత్పత్తి నిలిపివేసిన యాజమాన్యం దాదాపు నాలుగేళ్లు కావొస్తోంది. యాజమాన్యం ఐడీబీఐ, వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించనందుకు 2016 అక్టోబరు 22న ఐడీబీఐ మిల్లును స్వాధీనపర్చుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మిల్లు ఐడీబీఐ ఆధీనంలో ఉంది. మిల్లు మూతపడటంతో మూడేళ్లు కార్మికులకు ఉపాధి కరవై దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ చర్చల్లో పురోగతి లభించడంతో మిల్లు పునరుద్ధరణపై కార్మికుల్లో ఆశలు రెకెత్తుతున్నాయి.

ఆశాజనకంగా చర్చలు

- చర్చల్లో పాల్గొన్న కార్మికులు

మంగళవారం హైదరాబాద్‌లో ఐడీబీఐ, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎస్పీఎం పునరుద్ధరణపై చర్చలు ఆశాజనకంగా జరిగినట్టు, ఆ చర్చల్లో పాల్గొన్న ఎస్పీఎం కార్మికులు కుశన్న రాజన్న, గడధాసు మల్లయ్య, జి. నారాయణ, రాజేశ్వర్‌రావు, పి.శంకరయ్య వివరించారు. బుధవారం స్థానిక ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగిన చర్చలు, పురోగతిపై వివరించారు. గతంలో కంటేభిన్నంగా ఈ చర్చల్లో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొనడం, ఐడీబీఐ, బ్యాంకులు మిల్లు విలువ తగ్గింపునకు ముందుకు రావడం, ప్రభుత్వం రాయితీలు తదితర అంశాలపై చర్చలు సానుకూలంగా జరగడంతో మిల్లు పునరుద్ధరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ప్రభుత్వం మంత్రి కేటీఆర్ కృషి ఫలితంగా మిల్లు పునరుద్ధణలో చర్చల్లో పురోగతి ఉన్నట్టు చెప్పారు. ఈసారి జరిగిన చర్చల్లో పలువురు కార్మికులు పాల్గొనేందుకు ఎమ్మెల్యే కృషి చేశారు.



గణేష్ విగ్రహంతో ఊరేగింపు

ఘనంగా గణేష్ నిమజ్జనం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఎస్ఆర్ఎన్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. గణేష్ విగ్రహంతో ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నిదానానికే నీరసం.. నిర్లక్ష్యానికి నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి) పాటు కాలువల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసి, 14 వందల ఎకరాలకు సాగు నీరందస్తామని అధికారులు ఘనంగా ప్రకటించారు. 325 మీటర్ల పొడవు, 7.10 మీటర్ల ఎత్తుతో అలుగును నిర్మాణంతో పాటు, 9 కిలోమీటర్ల మేర కాలవను నిర్మించి ఆయకట్టు భూముల పంటలకు నీరందిస్తామని పేర్కొన్నారు. ఒక టీఎంసీలోపే (25.308 మిలియన్ క్యూబిక్ అడుగులు) జలాశయ నీటి నిలువ సామర్థ్యం ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం 218 ఎకరాల భూమి అవసరం ఉండగా, జలాశయం కోసం 154 ఎకరాలు, కాలువ కోసం 64 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. జలాశయం కోసం ప్రస్తుతం 54 ఎకరాలు మాత్రమే అధికారులు సేకరించి, ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించారు. జలాశయ మిగితా పనులకు 100 ఎకరాలు, కాలువ నిర్మాణం కోసం 64 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

అడుగుముందుకు పడని పనులు...

ఎనిమిది సంవత్సరాల కాలంలో కేవలం 270 మీటర్ల పొడవు, 7.10 మీటర్ల ఎత్తుతో ఆనకట్టను మాత్రమే నిర్మించారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.9 కోట్ల వరకు అధికారులు చేసిన వ్యయం బూడిదలో పోసిన పన్నీరులాగా, ఒక్క ఎకరం పొలం తడపకుండా అన్నదాతలకు అక్కరకు రాకుండా పోయింది. తూము నిర్మాణం వద్ద భూ వివాదాలు చుట్టుముట్టడంతో పనులు అడుగు ముందకు పడడం లేదు. మరో 164 ఎకరాల భూసేకరించకపోవడంతో అమాంతంగా పెరిగిన భూ సేకరణ పరిహారంతో వ్యయం రెట్టింపవుతుంది. ఏటికేడు నిర్మాణ వ్యయం పెరుగుతుందే తప్ప, భూ సేకరణ సమస్యను పరిష్కరించే కార్యాచరణను అధికారులు అమలు పరచడం లేదనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. సదరు గుత్తేదారుకు పలుమార్లు నోటీసులు అందజేసినా ఫలితం లేదు. మత్తడి వద్ద చేపడుతున్న ఎల్ఎస్ వింగ్‌తో పాటు రిటర్న్ గోడ నిర్మాణ దశలోనే ఉంది. అలుగుకు రెండు వైపులా నిర్మించే ప్లాంక్‌లను పూర్తి చేయకుండా అలాగే వదిలేశారు. మట్టి కట్ట పనులు, కాలువ పనులు ప్రారంభమే కాలేదు.

కాలువ నిర్మాణంపై స్పష్టత కరువు..

ప్రాజెక్టు నుంచి 9.12 కిలోమీటర్ల పొడవునా నంబాల, చింతల్‌గూడ, గంగాపూర్, ధర్మారం, లక్ష్మింపూర్, పాసిగావ్ గ్రామాల మీదుగా నిర్మించే కాలువ పనుల చుట్టూ పలు వివాదాలు చుట్టుముట్టుతున్నాయి. ప్రాజెక్టుకు నీటిని అందించే గంగాపూర్ వాగు పక్కనే ఈ కాలువ నిర్మాణం కొనసాగుతుండడం పట్ల నంబాల గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వాగు పక్కనే కాలువ నిర్మాణంతో ప్రయోజనం ఉండదని గ్రామస్థులు నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి సైతం తీసుకెళ్లారు. నంబాల చుట్టూ ఉన్న తొమ్మిది గొలుసుకట్టు చెరువులను ఈ ప్రాజెక్టు నీటి ద్వారా అనుసంధానించేలా ఎత్తిపోతల పథకం, లేదా కాలువ నిర్మాణం చేపడితే భూములన్నింటికి నీరందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

14 నెలల క్రితమే మా పరిధిలోకి వచ్చింది

- రాజు, డీఈ, నీటి పారుదల శాఖ

ఉమ్మడి జిల్లాలో నిర్మాణం ప్రారంభమైన నంబాల ప్రాజెక్టు పర్యవేక్షణ బెల్లంపల్లి నీటి పారుదల అధికారులు చేసేవారు. 14 నెలల క్రితం మా పరిధిలోకి వచ్చింది. భూ సేకరణ విషయంలో జాప్యం కారణంగానే పనులు జరగడం లేదు. గుత్తేదారుకు నోటీసులు సైతం అందజేశాం. మా పరిధి నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి బిల్లులు చెల్లించలేదు. ప్రాజెక్టు నుంచి నిర్మించే కాలువ గంగాపూర్ వాగు సమీపం నుంచి దాదాపు కిలోమీటరు పొడవు వరకు ఉంటుంది. నంబాల పరిసరాల్లో ఉన్న గొలుసుకట్టు చెరువులను ఈ ప్రాజెక్టు నీటితో అనుసంధానించాలంటే ఎత్తిపోతల పథకంతోనే సాధ్యం. ఇందుకు అదనంగా మరో రూ.10 కోట్ల వ్యయం వరకు కావచ్చు.

పంటలు ఎండుతున్నాయి



- బూసి నారాయణ, నంబాల

అయిదు ఎకరాల్లో పత్తి పంటను వేశాను. ప్రాజెక్టు సమీపంలోనే నా పంట చేను ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట ఎదగకుండా పోయింది. తొమ్మిది గొలుసుకట్టు చెరువులు, ప్రాజెక్టు ఉన్నా ఎండుతున్న పంటలకు నీరందించలేని దైన్య స్థితిలో ఉన్నాం.

గొలుసుకట్టు చెరువులతో అనుసంధానించాలి



- గజ్జల సత్యనారాయణ, నంబాల

ప్రాజెక్టు నీటిని గొలుసుకట్టు చెరువులతో అనుసంధానిస్తే 13 వందల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ఎనిమిది సంవత్సరాల నుంచి ప్రాజెక్టు పనులు అడుగుముందుకు పడడం లేదు. ఏటికేడు నిర్మాణం వ్యయం పెంచుకుంటూ పోతున్నారు తప్పితే పనులు అడుగుముందుకు పడడం లేదు. ఎందుకు కొరగాని అలుగు నిర్మించి రూ.కోట్ల సొమ్ము వృథా చేశారు.

బల్లార్‌పూర్ పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు

బలార్ష, న్యూస్‌టుడే: చంద్రపూర్ జిల్లా బల్లార్‌పూర్ పోలీసులు రానున్న వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే వీలుగా బల్లార్‌పూర్ పట్టణంలో మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు పాతబస్తీ, నూతన బస్టాండ్, కాగితపు మిల్లు ప్రాంతంతో పాటు టేకిడీ మీదుగా పాత బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగింది. పట్టణ ఠాణేదార్ సిరస్కర్‌తోపాటు జిల్లా రిజర్వ్ పోలీసు దళాలు స్థానిక పోలీసులతో కలిసి 128 మంది పాల్గొన్నారు.

వైద్యమందక అయిదు పశువుల మృత్యువాత

చింతలమానెపెల్లి, (కౌటాల గ్రామీణం): సకాలంలో వైద్యం అందక అయిదు మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటన బుధవారం మండలంలోని కర్జెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు బి.బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజులుగా అయిదు గేదెలు అంతుచిక్కని వ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి పశువైద్యాధికారులకు తెలియజేసినప్పటికీ స్పందించకపోవడంతో మంగళవారం రాత్రి అయిదు గేదెలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' పశు వైద్యాధికారిని రాధికను వివరణ కోరగా కర్జెల్లి గ్రామంలో మూడు రోజుల క్రితమే పశువులకు టీకాలు వేశామని పశువులు మృత్యువాత పడ్డాక బాధితుడు తమకు సమాచారం అందించినట్లు ఆమె తెలిపారు.

అన్నదాతకు అండగా...

(మొదటిపేజీ తరువాయి) కానున్నాయి. ఏదైనా పంటకు మార్కెట్లో ధర రాని పక్షంలో రాష్ట్ర రైతు సమితి జోక్యం చేసుకొని నేరుగా పంటను కొనుగోలు చేస్తుంది. ఇందుకు గాను ప్రభుత్వం సంఘానికి రూ.500 కోట్లు మూల నిధిని సమకూరుస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించుకునే దిశగా నేరుగా ఎంపిక చేసిన రైతులతో సీఎం సమావేశం కానున్నారు. దీనిపై మరిన్ని మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉంది. ఈ మేరకు ఈ నెల 31న వ్యవసాయాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశం తర్వాత ఆర్ఎస్ఎస్‌లపై మరింత స్పష్టత వచ్చే వీలుంది.

ఉత్తర్వులు జారీ అయ్యాయి

ఆశాకుమారి, డీఏఓ

రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారంగా రెవిన్యూ గ్రామాల వారీగా సమితులను ఏర్పాటు చేయనున్నాం. మంత్రి సూచన మేరకు కార్యాచరణ రూపొందిస్తాం. జిల్లాలో ఇటీవల సమగ్ర సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని మా సిబ్బంది సంగణకాల్లో పొందుపరుస్తున్నారు. గ్రామాలవారీగా సాగు విస్తీర్ణం, రైతుల పేర్లు, సంఖ్య తదితర వివరాలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. సమన్వయ సమితులకు సంబంధించి మండల, జిల్లా అధికారులతో 31న సమావేశం ఏర్పాటు చేశారు.

4.76లక్షల మంది రైతులకు ప్రయోజనం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే 4.76లక్షల మంది రైతులకు 'రైతు గుర్తింపు కార్డులు' ఇచ్చారు. ఈ కార్డులను ఆధారంగా చేసుకుని రైతులు పండించిన పంటను విక్రయించుకుంటున్నారు. అయితే.. రైతు గుర్తింపు కార్డులను మంజూరు చేసినా.. ఆ కార్డు ద్వారా రైతు పేరుమీద ఎంత భూమి ఉన్నదనే విషయాలు మాత్రమే తెలుస్తాయే తప్ప.. ఆ భూముల్లో ఏ ఏ పంటలను సాగుచేశారనే విషయం స్పష్టం చేయలేదు. దీంతో అదే కార్డును అన్ని రకాలైన పంట ఉత్పత్తుల విక్రయాలకు వినియోగించుకుంటున్నారు. దీని వల్ల రైతులను ప్రలోభపెట్టే వ్యాపారులు జీరో వ్యాపారాన్ని సాగించి రైతుల పేర్లతో ఎక్కువ ధరకు విక్రయించడం పరిపాటిగా మారింది.



రైతులతో సమావేశం(దాచిన చిత్రం)

పత్తి పంట నుంచే మొదలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో పత్తి పంటను సాగుచేశారు. గతేడాది కంటే ఈ సారి పత్తి ధరలు పడిపోతాయని భావిస్తున్నారు. సీసీఐ ఆధ్వర్యంలోనే పంట కొనుగోళ్లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దళారీలు మరింతగా రెచ్చిపోయే ప్రమాదం ఉండటంతో ఈ విధానం ద్వారా నిజమైన పత్తి రైతులను గుర్తించి వారికి మద్దతు ధర ఇప్పించడానికి దోహదపడుతుంది.

క్షేత్రమే ఓ ప్రయోగశాల

- భగీరథ ప్రయత్నం వీరి సొంతం..
- రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ఆపిల్ సాగు
- వివిధ పండ్ల తోటలతో రైతులకు ఆదర్శం





కెరమెరి మండలానికి ఓ ప్రత్యేకత ఉంది. మండలంలో జంగుబాయి, శంకర్‌లొద్ది వంటి చారిత్రక నేపథ్యంతో పాటు నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన ఆదివాసీ ఆరాధ్య దైవం కుమురం భీం పోరాట గడ్డ జోడేఘాట్ ఇక్కడే ఉంది. శీతలంగా ఉండే ఏజెన్సీ ప్రాంతంలో ఆపిల్‌ను ఇక్కడ సాగు చేస్తూ రాష్ట్ర ఉత్తమ రైతుగా ఎదిగిన వ్యక్తి మరొకరు మండలానికి పేరు తెచ్చారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ రైతు పురస్కారం పొందారు. మరెన్నో పండ్ల రకాలను సాగు చేస్తూ రైతులకే ఆదర్శమయ్యారు. ఆయనను చూసి మరొకరు అదే పంటలతో రాణిస్తున్నాడు.

ఆపిల్ మొక్కలతో కేంద్రే బాలాజీ

కెరమెరి, న్యూస్‌టుడే

కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని ధనోరకు చెందిన కేంద్రే బాలాజీ దక్షిణ భారతదేశంలోనే ప్రయోగాత్మకంగా ఆపిల్ సాగుతో పాటు మామిడి, అరటి, దానిమ్మ బత్తాయి వంటి పండ్లతోటలు, బంతి పూల తోటలతో రైతులందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకు ఉన్న అయిదు ఎకరాలను తండ్రి జ్ఞాపకార్థంగా 'ఏకనాథ్‌రావు కేంద్రే స్మారకదాం'గా మార్చుకున్నాడు. ఈ ప్రాంతంలో కూడా ఆపిల్ సాగు చేస్తామనే ఆలోచనకు సీసీఎంబీ శాస్త్రవేత్తల ప్రోత్సహం తోడవడంతో 2015లో మొదటగా 10 మొక్కలు నాటారు. కాని సఫలం కాకపోవడంతో 2016లో ఆపిల్‌లోని హరిమణ్ రకం 50, బిలాస్‌పూర్ రకం 50, నియోలీసన్ రకం 50 మొత్తం 150 మొక్కలు నాటారు. పంట కాలం మూడేళ్లు. ఏడాదికే పూతతోపాటు, కాయలు వచ్చాయి. జిల్లా పాలనాధికారి, సంయుక్త పాలనాధికారులతో పాటు వ్యవసాయ, ఉద్యావన శాఖాధికారులు సందర్శించి ప్రశంసించారు. ఆపిల్ పూతతో పాటు కాయలు కాయడం, వాతావరణ పరిస్థితులను రెండు, మూడు నెలలకు ఒకసారి సీసీఎంబీ శాస్త్రవేత్తలు సందర్శించి పరిశీలించారు. ఇక్కడి వాతావరణం 90 శాతం ఆపిల్ సాగుకు అనుకూలంగా ఉందని నిర్ధారించారు. ఇంకో ఏడాది గడిస్తే పూర్తిస్థాయిలో అంచనా వేయవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది మరో 300 ఆపిల్ మొక్కలను సాగు చేస్తున్నారు.

సేంద్రియంతో లాభం..

స్మారకదాంలో పండ్ల తోటలతో పాటు పెసర్లు, బంతిపూలు వంటి అంతర పంటలను కూడా సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం 40 బత్తాయి, 30 సంత్ర చెట్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఏడాది వీటి ద్వారా రూ.లక్ష పంట వస్తోంది. అందులో పెట్టుబడి 30 వేలు పోగా 70 వేలు లాభార్జన పొందుతున్నాడు. గత ఏడాది 150 చెట్లతో దానిమ్మ తోట వేశారు. మామిడి 120 మొక్కలు ఉన్నాయి. అర ఎకరంలో అరటి తోట వేశారు. ఒక ఎకరంలో బంతి పూలను వేశారు. సేంద్రియ విధానంలో గోమూత్రం, చీమల పుట్ట మట్టిని ఆపిల్ సాగు వాడుతున్నాడు. ఉష్ణోగ్రత తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాడు. ఇక్కడ కనీసం 5 సెంటిగ్రేడ్ల తక్కువగా ఉంటుంది.



ఆపిల్‌ని పండించమే లక్ష్యంగా పెట్టుకున్నా

- కేంద్రే బాలాజీ, ఉత్తమ రాష్ట్ర రైతు

మార్కెట్‌లోకి కెరమెరి ఆపిల్‌ని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. సీసీఎంబీ శాస్త్రవేత్తల సహకారంతో దాదాపు లక్ష్యానికి చేరువలో ఉన్నాం. ఇంకో ఏడాది గడిస్తే పూర్తిస్థాయిలో ఆపిల్ సాగుపై అంచనా వస్తోంది. ప్రభుత్వం నుంచి సహకారం ఉంటే బాగుంటుంది. ప్రోత్సహం ఉంటే ఇతర పండ్ల తోటను వేయడానికి సిద్ధంగా ఉన్నా.



ఆపిల్ బేర్‌తో బాదావత్ ప్రకాష్

బాలాజీ ఆదర్శంగా ప్రకాష్ సాగు..

కేంద్రే బాలాజీని ఆదర్శంగా తీసుకొని మండలంలోని అనార్‌పల్లికి చెందిన గిరిజనుడు బాదావత్ ప్రకాష్ కూడా ఆపిల్ సాగును ప్రారంభించాడు. తనకు ఉన్న భూముల్లోని మూడు ఎకరాలలో ఆపిల్‌తోపాటు ఆపిల్‌బేర్, మామిడి, నిమ్మ, బొప్పాయి పండ్లతోటతో పాటు బంతి పూల తోటల సాగుకు నడుంకట్టారు. ఆపిల్ మొక్కలు వేసి సుమారు ఏడాది గడుస్తోంది. ప్రస్తుతం మొక్కల పెరుగుదల బాగుంది.

ప్రభుత్వం సాయం చేస్తే బాగుంటుంది..



- బాదావత్ ప్రకాష్, అనార్‌పల్లి

మాకున్న ఆర్థిక పరిస్థితుల్లో పలు పండ్ల తోటలను సాగు చేస్తున్నాం. ప్రభుత్వం ఐటీడీఏ, ఉద్యాన వన శాఖల ద్వారా రాయితీ రూపంలో కొంత ఆర్థికంగా ప్రోత్సహిస్తే బాగుటుంది. ఇతర పండ్ల తోటలను పెంచడానికి అవకాశం ఉంటుంది. ఆపిల్ నిర్వహణ ఖర్చులు ఇస్తామని ఉద్యాన వన శాఖాధికారులు చెబుతున్నారు కాని ఇంతవరకు ఇవ్వలేదు.

నిర్వహణ ఖర్చులు అందించే ఏర్పాటు చేస్తున్నాం

- మేయర్ భాషా, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

ఆపిల్ మినహా ఇతర పండ్ల తోటలపై నిర్వహణ ఖర్చులు అందించేలా ఏర్పాటు చేస్తున్నాం. ఆపిల్ సాగు అనేది ఈ ప్రాంతంలో కొత్త ప్రాజెక్ట్ కావున ప్రభుత్వం నుంచి రాయితీ ఇవ్వడం లేదు. సీసీఎంబీ శాస్త్రవేత్తల ద్వారా వర్మీ కంపోస్టు, వేల పొడి కోసం ప్రోత్సాహకంగా కొంత ఖర్చులు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం. శాఖ పరంగా సాగు తీరులో పలు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతులను పండ్ల తోటల వైపుగా ప్రోత్సహిస్తున్నాం.

దక్షిణాది రాష్ట్రాలలో ఆపిల్ సాగుకు కృషి..

- డా.వీరభద్రరావు, సీసీఎంబీ శాస్త్రవేత్త

దక్షిణాధి రాష్ట్రాలలో ఆపిల్ సాగు కృషికి ప్రత్యేకంగా ప్రాజెక్టు చేపట్టాం. అందులో భాగంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం అరకు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నాం. ముఖ్యంగా కొంత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలోని ఆసక్తి గల రైతులను ప్రోత్సహిస్తున్నాం. మొక్కలను ఉచితంగా ఇవ్వడంతో పాటు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. కెరమెరి మండలంలోని ధనోరలో అనుకూలమైన వాతావరణం ఉంది. ఇంకో ఏడాది గడిస్తే పూర్తిగా అంచనా వేయవచ్చు.



కంప్యూటర్ కోర్సును ప్రారంభిస్తున్న సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు అనురాధ

సింగరేణి ఉద్యోగుల భార్యల సంఘం(సేవ) ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలు కార్మిక కుటుంబాల్లో కాంతులు నింపుతున్నాయి. సేవ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ రకాల శిక్షణలను సద్వినియోగం చేసుకొని ఎంతో మంది నిరుద్యోగ గృహిణులు, యువతులు స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. మగువలు వంటింటికే పరిమితమనే నానుడిని చెరిపేస్తూ అన్నీ రంగాల్లో పురుషులకు దీటుగా దూసుకెళ్తున్నారు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే స్వయం ఉపాధి వైపు పయనిస్తున్నారు. తాము నేర్చుకున్న పనిని ఇతర మహిళలకు నేర్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అలాగే యువకులకు సైతం వివిధ కోర్సులతో ఆత్మ విశ్వాసం నింపుతున్నారు. సేవ సమితి ద్వారా శిక్షణ పొందిన యువతపై 'న్యూస్‌టుడే' కథనం.



కుట్టుపనిలో శిక్షణ పొందుతున్న మహిళలు

సింగరేణి 'సేవ'.. చూపింది స్వయం ఉపాధి తోవ

- కార్మిక ప్రాంతాల్లో కాంతులు
- సత్ఫలితాలిస్తున్న సేవా సమితి కార్యక్రమాలు

రెబ్బెన, న్యూస్‌టుడే

బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం కార్యాలయం బెల్లంపల్లి పట్టణంలో ఉన్నప్పుడే సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సులు ప్రారంభమయ్యాయి. అనంతరం ఏరియాలోని భూగర్భ గనులు మూతపడుకుంటూ రావడం, గోలేటి ఏరియాలో గనులు ఉండటంతో జీఎం కార్యాలయం గోలేటికి తరలించారు. కాగా 2002 సంవత్సరంలో మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించేందుకు ఉచితంగా పలు కోర్సులను ప్రవేశ పెట్టి శిక్షణ ఇప్పించింది. గృహిణులతో పాటు నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందే విధంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. సేవ సమితి ఆధ్వర్యంలో మహిళలను వృత్తి శిక్షణ కోర్సులపై వైపు ఆసక్తి కలిగే విధంగా చైతన్య పరిచారు. బెల్లంపల్లి రీజియన్‌లోని లేని విశాలమైన ప్రాంతం బెల్లంపల్లి డివిజన్. జీఎం కార్యాలయంలో పరిధిలోని మాదారాం, గోలేటిలలోని కార్మిక కుటుంబాలతో పాటు కార్మికేతర పిల్లలకు అన్ని ఏరియాలలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎంతో మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి, వారిని స్వయం ఉపాధి పొందే విధంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఎంతో ఉపాధి పొందుతున్నారు.

2002 నుంచి 2017 వరకు శిక్షణ పొందిన వివరాలు

వృత్తులు	శిక్షణ పొందిన వారు	ఉపాధి పొందుతున్న వారు
సారీ రోలింగ్	70	10
ఫొటోగ్రఫీ	20	10
ఎలక్ట్రిషీయన్	66	17
ఆటోమొబైల్	20	07
రెక్సిన సంచులు	30	05
ఫ్యాషన్ టెక్నాలజీ	40	06

★ ఇవే కాకుండా వెబ్ డిజైన్‌లో 130 మందికి, ప్రీ ప్రైమరీ టీచర్‌లో 63 మందికి, ఫాస్ట్ ఫుడ్ క్యాటరింగ్‌లో 40 మందికి, స్పోకేన్ ఇంగ్లీష్‌లో 100, పేపరు కారీ సంచుల తయారీలో 100 మందికి శిక్షణ ఇచ్చారు. అలాగే సేవ సమితి ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో వలంటీర్లను నియమించి విద్యను కొనసాగిస్తున్నారు.

బెల్లంపల్లి ఏరియా 2002 నుంచి 2017 వరకు ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ శిబిరాలు, వాటితో స్వయం ఉపాధి పొందుతున్న అభ్యర్థుల వివరాలు ఇలా..

శిక్షణ ఇచ్చిన వృత్తులు	శిక్షణ పొందిన వారు	స్వయం ఉపాధి పొందుతున్న వారు
టైలరింగ్	1110	357
బ్యూటీషియన్	310	101
కంప్యూటర్ డీటీపీ	211	190
మోటర్ డ్రైవింగ్	238	87
ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ సివిల్, సీఐఎస్‌ఎఫ్	1160	149

భూ నిర్వాసితులకు వృత్తి శిక్షణ

బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ఉపరితల గనులలో భూములు కోల్పోయిన నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోనూ సేవ సమితి ఆధ్వర్యంలో పలు వృత్తి శిక్షణ కోర్సులు ప్రవేశ పెట్టారు. పునరావాస కేంద్రాలైన ఇంద్రానగర్, చోపిడి, ఒంటి మామిడి, రాంబాయిగూడ, సాలెగూడ, గిన్నెధరి, దాంపూర్, చిర్రకుంటలలో టైలరింగ్, అగర్‌బస్తీలు, సంచుల తయారీపై 410 మందికి శిక్షణ ఇచ్చారు. ఉల్లిపిట్టలో టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. వారిలో కొంత మంది స్వయం ఉపాధి పొందుతున్నారు.

శిక్షణ బాగుంది



- శైలజ, ఉల్లిపిట్ట

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇచ్చిన కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకున్నా. మూడు నెలల పాటు నేర్చుకున్నా. ఇప్పుడు నేను సొంతగా బ్లౌజ్‌లు కుడుతున్నాను. వచ్చే డబ్బులను నా వంతు బాధ్యతగా మా తల్లిదండ్రులకు ఇస్తున్నా.

ఉపాధి చూపింది

- విజయలక్ష్మి, బ్యూటీషియన్ శిక్షకురాలు

నేను సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇస్తున్న బ్యూటీషియన్ శిక్షణలో చేరాను. నాకు ఉన్న ఆసక్తితో అనతి కాలంలోనే శిక్షణను పూర్తి చేసుకున్నా. నా ప్రతిభను గుర్తించిన సింగరేణి నన్ను బ్యూటీషియన్ కోర్సుకు శిక్షకురాలిగా నియమించారు. నాకున్న అనుభవంతో మహిళలకు నేర్పిస్తున్నా. ఇంట్లోనే స్వయం ఉపాధి పొందుతున్నా.



కుటుంబానికి ఆసరాగా

- తిరుమల, శిక్షకురాలు

నేను ఏడేళ్ల క్రితమే సింగరేణి సేవ సమితి ఇచ్చే టైలరింగ్ శిక్షణ కోర్సులో చేరి నేర్చుకున్నా. ఏ ఉద్యోగం చేయాలన్నా ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది. అదే ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని చూసుకుంటూ టైలరింగ్ చేస్తున్నా. ఆర్థికంగా కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సింగరేణిలో టైలరింగ్ శిక్షకురాలిగా నియమించారు. ప్రస్తుతం నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు.



స్పోకెన్ ఇంగ్లీష్‌తో ఎంతో మేలు

- సుజాత

నేటి సమాజంలో స్పోకేన్ ఇంగ్లీష్ ఎంతో అవసరమని గుర్తించా. అందుకే నేను సేవా సమితి ఆధ్వర్యంలో ఇస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్‌లో చేరి నేర్చుకున్నా. సింగరేణి ఉచితంగా ఇస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, సారీ రోలింగ్, కుట్టు అల్లికలు తదితర కోర్సులను బయట నేర్చుకోవాలంటే రూ. వేలల్లో ఖర్చు అవుతుంది. అదే సింగరేణి మాత్రం నయా పైసా లేకుండా చక్కగా నేర్పిస్తుంది.



మహిళలకు స్వయం ఉపాధి

- కె.అనురాధ, సేవ సమితి అధ్యక్షురాలు

సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏటా సేవ సమితి నేతృత్వంలో కార్మికుల నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ వృత్తి విద్య కోర్సులపై శిక్షణ ఇస్తున్నాం. మహిళలు, యువతులు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిపేందుకు బ్యూటీషియన్, టైలరింగ్, కంప్యూటర్ తదితర కోర్సులు నిర్వహిస్తున్నాం. స్వయం ఉపాధి పొందేందుకు ఎంతో దోహదపడతాయి. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.



ఫ్యాషన్‌లో దూసుకెళ్తున్నారు

- మోడలింగ్‌పై జిల్లా యువత ఆసక్తి
- మిస్టర్ ఇండియా పోటీల్లో ప్రతిభ



పురస్కారంతో మహ్మద్ సమీర్

సాంకేతిక... శాస్త్ర రంగం ఎంతో అభివృద్ధి చెందుతోంది. దానికి అనుగుణంగా యువత సైతం భిన్న రంగాల్లో రాణించేందుకు ఆసక్తి చూపుతోంది. ఎలాంటి శిక్షణ లేకుండానే పలువురిని స్ఫూర్తిగా తీసుకొని పలువురు యువకులు ర్యాంప్ వాక్... మోడలింగ్.. ఫ్యాషన్ రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సమీర్, వ్యాస్‌లు ర్యాంప్ వాక్‌లో తళుక్కుమన్నారు.

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

ఈ నెల 27వ తేదీన వీబీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హోటల్ యూనైటెడ్-21లో 'మిస్టర్ అండ్ మిస్ ఇండియా' ర్యాంప్ వాక్.. ఫ్యాషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 350 మోడల్స్ పాల్గొనగా, 25 మంది టాపర్లుగా నిలిచారు. అందులో కాగజ్‌నగర్‌కు చెందిన యువకులు మహ్మద్ సమీర్, శంకర్ వ్యాస్‌లకు అవకాశం లభించింది. త్వరలోనే వీబీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మోడలింగ్ శిక్షణలో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది.

చిన్నప్పటి నుంచి మోడలింగ్ అంటే ఇష్టం..

స్థానిక నివాసి ఎండీ యూసుఫ్ - జాహెద బేగం దంపతుల కుమారుడు మహ్మద్ సమీర్. స్థానిక ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆయనకు చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ మోడలింగ్‌పై ఆసక్తి. అయితే 2013, 2014, 2015 సంవత్సరాల్లో వరుసగా జిల్లా యూత్ ఫెస్టివెల్‌లో జిల్లా స్థాయి ఫ్యాన్సీ డ్రెస్సింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2015 రాష్ట్ర స్థాయిల్లోనూ పాల్గొని అవార్డు సాధించారు. 2016లో హైదరాబాద్‌లో మోడల్ హంట్‌లో పాల్గొన్నాడు. అదే సంవత్సరంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని మోడలింగ్ డిజైనర్స్ ఆధ్వర్యంలో మోడలింగ్ షోను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాడు. మోడలింగ్‌లో మరింత తర్ఫీదు తీసుకోవాలనే ఉద్దేశంతో 2016లో లకోటియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడలింగ్ శిక్షణ సంస్థలో ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లో వీబీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'మిస్టర్ అండ్ మిస్ ఇండియా' ర్యాంప్ వాక్‌లో 10/10 పాయింట్లు సాధించారు. 350 మందిలో 25 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలోనూ టాపర్‌గా నిలిచారు. మోడలింగ్‌లో మరింత శిక్షణ తీసుకుని దేశవ్యాప్తంగా జరిగే ఈ పోటీల్లో పాల్గొని, విజయం సాధించేందుకు సాధన చేస్తానని తెలిపారు. స్థానిక నివాసి, దివంగత మోడల్ మానిష్‌ను స్ఫూర్తిగా తీసుకొని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతున్నట్లు మహ్మద్ సమీర్ అభిప్రాయపడ్డారు.

మొదటి ప్రయత్నంలోనే...

స్థానిక నివాసి, వ్యాపారి భీష్మా వ్యాస్ - భగవతి వ్యాస్ దంపతుల కుమారుడు శంకర్ వ్యాస్. స్థానిక వసుంధర డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచే మోడలింగ్, ఫ్యాషన్‌పై ఆసక్తి. ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే తన మిత్రుడు మహ్మద్ సమీర్ వద్ద మోడలింగ్‌పై తర్ఫీదు తీసుకున్నాడు. ర్యాప్ వాక్‌లో 10 పాయింట్లుకు 9.5 పాయింట్లు సాధించాడు. వచ్చే నెలలో జరిగే ఎల్‌బీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ఉచిత మోడలింగ్ శిక్షణకు ఎంపికయ్యారు. మోడలింగ్, ఫ్యాషన్ రంగంల్లో మరింత తర్ఫీదు తీసుకొని, జాతీయ, అంతర్జాతీయ మోడలింగ్‌లో రాణించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికను రూపొందించుకున్నట్లు విద్యార్థి వ్యాస్ పేర్కొంటున్నారు.





ర్యాంప్ వాక్‌లో శంకర్‌వ్యాస్

సర్కారు బడి నుంచి.. శాస్త్రవేత్తగా..



ఉపన్యాసం ఇస్తున్న డాక్టర్ శంకర్‌రావు

- రైతు కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు
- గణిత శాస్త్రవేత్త శంకర్‌రావుకు పురస్కారం

రెబ్బెన, న్యూస్‌టుడే

కష్టపడి పని చేస్తూ తన పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేయాలనే తపనతో ఉన్నత చదువులు చదివించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేశారు ఆ దంపతులు. పేద కుటుంబానికి చెందిన ముంజం చిన్నూజీ, పోచుబాయి దంపతులకు ఆరుగురు సంతానం. వారందరిని సరస్వతి పుత్రులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు పడిన శ్రమ చెప్పలేనిది. గంప నెత్తిన పెట్టి ఊరూర కూరగాయలు అమ్ముకుంటూ పిల్లలను చదివించారు. మూడో కుమారుడు డాక్టర్ శంకర్‌రావు గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులపై ఇచ్చిన ఉపన్యాసాలు, పరిశోధనలు ఆయనకు 'మీనాక్షి సుందరం అవార్డు' తెచ్చిపెట్టింది. ఆయన విజయంపై 'న్యూస్‌టుడే' కథనం..

రెబ్బెన మండలం కైర్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లుగూడ గ్రామానికి చెందిన చిన్నూజీ, పోచుబాయికి ఆరుగురు సంతానం. ఇందులో మొదటి కొడుకు లక్ష్మణ్‌రావు కొంత వరకు చదువుకున్న ఆయన వ్యయసాయం చేసుకుంటున్నాడు. రెండో కొడుకు ఆనంద్‌రావు, నాలుగో కుమారుడు బాబురావు, కూతురు జ్యోతి అధ్యాపకులుగా పని చేస్తుండగా, మరో కూతురు తారాబాయి ఎయిడెడ్ విద్యాలయంలో అటెండర్‌గా పని చేస్తోంది. మూడో కొడుకు శంకర్‌రావు ఉన్నత చదువులు చదివి అరుదైన అవార్డును దక్కించుకున్నాడు.

సర్కారు చదువులతో ఉన్నత శిఖరాలు..

డాక్టర్ ముంజం శంకర్‌రావు తన బాల్యం చదువులు ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. 1 నుంచి 5 వరకు కైర్‌గాం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. 6, 7 తరగతులను నవేగాం, 8 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆసిఫాబాద్‌లో, ఎమ్మెస్సీ డిగ్రీని కాగజ్‌నగర్, కాకతీయ యూనివర్శిటీలో గణితశాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను పూర్తి చేశాడు. ఈ నెల 11 నుంచి 13 వరకు కాకతీయ యూనివర్శిటీలో గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు అనే అంశంపై జాతీయ కాంగ్రెసు సదస్సు నిర్వహించింది. దీనిలో గణిత శాస్త్రవేత్త డాక్టర్ ముంజం శంకర్‌రావుకు మీనాక్షి సుందరం మెమోరియల్ అవార్డు కైవసం చేసుకున్నాడు. ఈ జాతీయ సదస్సులో 12 స్మారకోపాన్యాసాలు, 10 ప్రత్యేక ఆహ్వానిత ఉపాన్యాసాలతో పాటు గణితంలో వివిధ అంశాలపై దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు. 148 పరిశోధన పత్రాలలో ఉత్తమ పరిశోధన పత్రాన్ని చైనా దేశం షాంఘై జియోటింగ్ యూనివర్శిటీ డాక్టర్ ముంజం శంకర్‌రావును ఎంపిక చేశారు. దీంతో ఆయనకు ప్రఖ్యాత మీనాక్షి సుందరం అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని యూనివర్శిటీ రిజిస్ట్రార్ పురుషోత్తం, యూజీసీ కోఆర్డినేటర్ సారంగపాణి, కేయూ గణిత విభాగం అధిపతి ఏపీ మ్యాథమెటికల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య తోట శ్రీనివాస్ అందజేశారు.

గణిత పరిశోధనపై మక్కువ..

డాక్టర్ ముంజం శంకర్‌రావు గణిత పరిశోధనపై ఉన్న మక్కువతో ఉన్నత లక్ష్యాలను సాధిస్తున్నాడు. అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలనే ఆయన వరంగల్ కాకతీయ యూనివర్శిటీ క్యాంపస్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. మాస్టర్ ఆఫ్ ఫిలోసఫీ కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించిన అర్హత పరీక్షలో మొదటి ర్యాంకు సాధించి 2009లో పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీలో పూర్తి చేశారు. అదే యూనివర్శిటీలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. భారత దేశంలో దళితులకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన యూజీసీ రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిఫ్ అవార్డుకు ఎంపికయ్యాడు. 2017 నుంచి 2030 వరకు వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇంజినీరింగ్ టెక్నాలజీకి ఇంటర్నేషనల్ సైంటిఫిక్ టెక్నికల్ కమిటీ అండ్ ఎడిటోరియల్ రివ్యూ బోర్డు సభ్యునిగా, గణిత, ఇంజనీరింగ్ సైన్సెస్‌కు ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నాడు. జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధన పత్రాన్ని సమర్పించి, కీలకోపాన్యాసాలు అందించిన గణిత శాస్త్రవేత్త శంకర్‌రావును కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పురుషోత్తం ఘనంగా సత్కరించి, ప్రశంస పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.



పురస్కారం అందుకుంటున్న గణిత శాస్త్రవేత్త డాక్టర్ ముంజం శంకర్‌రావు

ప్రభుత్వం ప్రోత్సహించాలి

- ముంజం శంకర్‌రావు, గణితశాస్త్రవేత్త

యూనివర్శిటీ స్థాయిలో గణిత శాస్త్రవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. గణితశాస్త్రానికి సంబంధించిన ల్యాబొరేటరీలు సరిగా లేవు. సాఫ్ట్‌వేర్‌ను మెరుగుపర్చాలి. ఇతర దేశాలతో పోల్చిస్తే మన దగ్గర క్షేత్ర స్థాయిలో గణితం పెద్దగా ఉపయోగం పడటంలేదు. నా వంతుగా 20 మందిని శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నా. గణితంలో వస్తున్న మార్పులను ప్రపంచానికి తెలియడానికి నా వంతు కృషి చేస్తున్నా. దేశానికి ఉపయోగపడేలా గణితశాస్త్రంలో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తా.

సంస్థ నిర్మాణ గోడలపై ప్రచార రాతలు నిషేధం

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణికి సంబంధించిన కార్యాలయాలు, నివాస గృహాలు, ఉద్యానవనాలు, కమ్యునిటీహాళ్ల గోడలపై ఎన్నికల ప్రచార రాతలను నిషేధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జీఎం పీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల సందర్భంగా వివిధ సంఘాలు తమ ప్రచారాల కోసం సంస్థకు సంబంధించిన గోడలను వినియోగించుకునే అవకాశం లేదన్నారు. ఎన్నికల కోడ్ ప్రకారం సంస్థ ఆస్తులు, కార్యాలయాలను, నివాస గృహాలను వాడుకోరాదన్నారు.



'కార్మికుల హక్కులను కాపాడే ఎర్రజెండా ఏఐటీయూసీ'

రెబ్బెన, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలను పరిష్కరించుకుంటే వారి హక్కులను కాపాడే సత్తా ఎర్రజెండా పార్టీ ఏఐటీయూసీతోనే సాధ్యమవుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల ఓదెలు అన్నారు. బుధవారం గలేటిలోని కేవేల్ మహేంద్ర భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఖైరిగూర ఓసీపీ పిట్‌కార్యదర్శి జుపాక రాజేష్, నాయకులు జాడి తిరుపతి, సురేష్‌కోరి పాల్గొన్నారు.

ఒప్పందం దిశగా అడుగులు

బొగ్గు గని కార్మికుల పదో వేతన ఒప్పందంపై గురువారం సంతకాలు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య ఏవైనా వైరుధ్యాలు ఉంటే, వాటిని జేబీసీసీఐ స్టాండింగ్ కమిటీలో పరిష్కరించుకునే విధంగా నిబంధనలు రూపొందించి, పరస్పరం ఆమోదయోగ్యమైన అంశాలపై ఒప్పందం కుదుర్చుకోవచ్చని నాయకులు భావిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామాలపై 'న్యూస్‌టుడే' కథనం.

నేడు కోల్‌కతాలో పదో వేతన కమిటీచర్చలు

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే

కార్మికవర్గం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పదో వేతన ఒప్పందంపై తాడోపేడో తేల్చుకునే సమయం ఆసన్నమైంది. కార్మిక సంఘాలు జూన్ నెలలో ఇచ్చిన దేశవ్యాప్తంగా మూడు రోజుల సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో, మూడు నెలల్లోగా పదో వేతన ఒప్పందాన్ని ఖరారు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గురువారం ఒప్పందం జరగాల్సి ఉంటుంది. లేనిపక్షంలో మరో ఆరేడు నెలల వరకు వేతన కమిటీ చర్చలే జరిగే అవకాశం కనిపించడంలేదని నాయకులు అభిప్రాయపడుతున్నారు. కోల్ ఇండియా ఛైర్మన్ సుతీర్థ భట్టాచార్య గురువారమే ఉద్యోగ విరమణ చేయనుండటంతో, బొగ్గు పరిశ్రమపై పట్టున్న ఆయన ఆధ్వర్యంలోనే ఈ ఒప్పందం జరగాల్సి ఉంటుంది. ఒక వేళ ఒప్పందం వాయిదా పడితే, కొత్త ఛైర్మన్ సంస్థ గురించి, వేతన ఒప్పందాల గురించి అవగాహన పెంచుకుని చర్చలు ఏర్పాటు చేయాలంటే కనీసం ఆరు మాసాలు పడుతుందని కార్మిక నేతలు చెబుతున్నారు. ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన చర్చల సందర్భంగా దాదాపు వేతన ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాపై సంతకాలు చేసే సమయానికి యాజమాన్యం నాయకులకు అందించిన చిత్తు ప్రతిలో వారం రోజుల పని విధానం, హాజర్ల బోనస్, భూగర్భ అలవెన్సులపై కఠినమైన ఆంక్షలు విధించడాన్ని చూసిన నాయకులు



ఒక్కసారిగా నిర్ఘాంతపోయి, 25న అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట ప్రాంతంలో చర్చల నుంచి బయటకు వచ్చారు. దీంతో యాజమాన్యం 26న కోర్ కమిటీ నేతలతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. 28, 29 తేదీల్లో డ్రాఫ్ట్ కమిటీ సమావేశమై, విధి విధానాలను రూపొందించే పనిలో పడింది. అంతకు ముందే ప్రధాన సమస్య అయిన 20 శాతం కనీస వేతన పెరుగుదల, 4 శాతం ప్రత్యేక అలవెన్సుపై ఒప్పందం కుదరడంతో మిగతా అంశాలు పెద్ద సమస్యగా పరిణమించే అవకాశం లేదు.

కొర్రీలపై వెనక్కి తగ్గే అవకాశం

ఏడు రోజుల పని విధానం, హాజర్ల బోనస్, భూగర్భ అలవెన్సులపై కొర్రీలు పెట్టే అవకాశం లేదని సమాచారం. భూగర్భ అలవెన్సు, హాజర్ల బోనస్‌పై విధించిన ఆంక్షల వల్ల ప్రధానంగా ఉద్యోగ విరమణకు ముందు కచ్చితంగా సెలవులు వినియోగించుకోవాల్సి ఉంటుంది. యాజమాన్యం ప్రతిపాదనకు అంగీకరిస్తే కార్మికులు సెలవులు వాడుకుంటే హాజర్ల బోనస్, భూగర్భ అలవెన్సు వచ్చే అవకాశం లేదు. దీని ప్రభావం పింఛనుపై, ఇతర ప్రయోజనాలపై పడుతుంది. ఇతర క్రీడాకారులు, ఆన్ డ్యూటీపై ఇతరత్రా పనులపై వెళ్లేవారికి హాజర్ల బోనస్ లభించదు. ఇంతటి ప్రమాదకరమైన కొర్రీకి కార్మిక సంఘాలు అంగీకరించే అవకాశం లేదు. రెండు రోజుల పాటు సమావేశమైన డ్రాఫ్ట్ కమిటీ పదో వేతన ఒప్పందానికి సంబంధించిన విధి విధానాలను దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం. గతంలో పరస్పరం అంగీకరించిన అంశాలైన 20 శాతం వేతన పెరుగుదలతో మొదటి క్యాటగిరి కార్మికులకు 2016 జులై 1 నుంచి రోజుకు రూ.188.42 చొప్పున నెలకు రూ.4,898.92 పెరుగుదల ఉంటుంది.

ప్రమాదకరమైన జబ్బులకు గురైనవారికి ఊరట

పదో వేతన ఒప్పందంలో ప్రమాదకరమైనవిగా గుర్తించిన ఆరు జబ్బుల బారిన పడిన వారికి ఇప్పుడిస్తున్న ఆరు నెలల వేతనానికి బదులుగా, విధి నిర్వహణకు ఫిట్ చేసేంత వరకు వేతనం చెల్లించేలా డ్రాఫ్ట్ ఒప్పందంలో పేర్కొన్నారు. గుండె జబ్బులు, క్యాన్సర్, పక్షవాతం, హెచ్ఐవీ, తీవ్రమైన మూత్ర పిండాల వ్యాధి, టీబీతో బాధపడే వారు తిరిగి మెడికల్ ఫిట్ అయ్యేంత వరకు వేతనం చెల్లించే అవకాశం ఉంది. అదే విధంగా ఆర్జిత సెలవులను ప్రస్తుతం 140 రోజుల వరకు నిల్వ చేసుకునే వెసులుబాటు ఉండగా, దీన్ని 150కి పెంచనున్నట్లు తెలిసింది.

వేతన స్థిరీకరణ ఈ విధంగా ఉంటుంది. ఉదాహరణకు దినసరి కార్మికులకు మొదటి క్యాటగిరి కార్మికుల ప్రస్తుత వేతనం, సవరించనున్న వేతనం వివరాలు రూపాయాల్లో..

అంశం	30.06.16	01.07.16
మూల వేతనం	604.33	1011.27
హాజర్ల బోనస్	60.43	101.127
ఎస్‌డీఏ	10.85	18.15
వీడీఏ	266.51	0.00
మొత్తం	942.12	1130.54
కనీస లాభం	188.42	-------
అన్నీ కలిపి	1130.54	

✦ నెలసరి వేతన కార్మికుల వేతన స్థిరీకరణ ఈ విధంగా ఉండనుంది. ఉదాహరణకు క్లరికల్ గ్రేడ్-3 ఉద్యోగుల వేతన పెరుగుదల ఈ విధంగా నిర్ధారించనున్నారు.

అంశం	3.06.2017	01.07.2017
మూల వేతనం	16,877.86	28,242.84
హాజర్ల బోనస్	168.79	2824.284
స్పెషల్ డీఏ	302.96	506.96
వీడీఏ	7,443.14	0.00
మొత్తం	26,311.74	31,574.09
కనీస లాభం	5,262.35	----------
అన్నీ కలిపితే	31,574.09	

వారసత్వ ఉద్యోగాల కోసం నిరవధిక దీక్ష

మద్దతు పలికిన కార్మిక, రాజకీయ సంఘాలు

మందమర్రి, న్యూస్‌టుడే: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి డిపెండెంట్ యువసేన ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్షలను చేపట్టారు. బుధవారం మందమర్రిలోని బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహా ఆవరణలో యువసేన నాయకులు, కార్యకర్తలు దీక్షకు పూనుకున్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రవెల్లి రాజేశ్, ఇతర నాయకులకు పూలమాలలు వేసి దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ..సింగరేణిలో చట్టబద్ధతలేని వారసత్వ ఉద్యోగాలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్, సింగరేణి గుర్తింపు సంఘం తెబొగకాసం సింగరేణి కార్మికవర్గానికి తీరని అన్యాయం చేసిందన్నారు. సంఘం నాయకులు కందుల వెంకటేష్, బరిగల సతీష్, రాజుగౌడ్, ముంజం రాకేష్ దీక్షలో కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా నిలిచిన తెలంగాణ ధూం..ధాం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ కళాకారుల ఆధ్వర్యంలో వారసత్వ ఉద్యోగాల సాధన కోసం సింగరేణి డిపెండెంటు యువసేన చేపట్టిన ఆందోళనకు మద్దతుగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.



దీక్షలో పాల్గొన్న యువసేన నాయకులకు మద్దతు పలికిన రాజకీయ, కార్మిక సంఘాల నేతలు

సంఘీభావం ప్రకటించిన రాజకీయ, కార్మిక సంఘాలు

సింగరేణి డిపెండెంటు యువసేన ఆధ్వర్యంలో మందమర్రిలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు సింగరేణి కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించాయి. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్, సీపీఐ మందమర్రి మండల, ఆర్కేపీ పట్టణ కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, సంగి సంతోష్, దళిత బహుజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీర్ల సత్యం, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ, సహాకార్యదర్శి భీమనాధుని సుదర్శనం, టీఎస్టీయుసీ ప్రధాన కార్యదర్శి బి.సంజయ్ కుమార్, గాజుల ప్రతాప్, వాసాల సాగర్ తదితరులు మద్దతు పలికారు.

లాభాలను తక్కువ చూపిన యాజమాన్యంపై 'కాగ్'కు ఫిర్యాదు

టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి బి.సంజయ్‌కుమార్

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన వాస్తవ లాభాలను తక్కువ చూపి కార్మికవర్గానికి అన్యాయం చేసేందుకు యాజమాన్యం కుట్రలు చేసిందని నిజంగా వచ్చిన లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 'కాగ్'(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్)కు తమ సంఘం ఫిర్యాదు చేసిందని టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి బి.సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రామకృష్ణాపూర్‌లోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కార్మికుల కష్టార్జితంతో 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధిస్తే రూ.1063 కోట్ల లాభాలను సంస్థ ఆర్జించిందన్నారు. గడిచిన ఏడాది(2016-17) కార్మికులు 63.5 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తే సింగరేణి యాజమాన్యం కుట్రపూరితంగా కేవలం రూ.395 కోట్ల లాభాలు వచ్చాయని ప్రకటించి కార్మికవర్గానికి తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి వెయ్యి కోట్లకు పైగా లాభాలు వస్తే 63 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తే అంతకన్నా అధికంగా లాభాలు రావాల్సి ఉందన్నారు. సుమారు రూ.1700 కోట్ల వాస్తవ లాభాలు వచ్చినప్పటికి వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి మళ్లించేందుకు సింగరేణి అధికారులు తక్కువ లాభాలను ప్రకటించారన్నారు. సంస్థ లాభాలను బతుకమ్మ, పుష్కరాలు, హరితహారం, సింగరేణేతర ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధుల పేరిట తరలించి సింగరేణి అధికారులు ప్రభుత్వం వద్ద మెప్పు పొందుతున్నారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న బి.సంజయ్‌కుమార్

లాభాలపై తప్పుడు ప్రకటన చేసిన అధికారులను సస్పెండు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెదేపా మండల అధ్యక్షుడు గోపు రాజం, నాయకులు లక్ష్మినర్సయ, తుంగ వెంకటేశ్, రామిడి శేఖర్, గాజుల ప్రతాప్, వాసాల సాగర్, సెగ్యం రవి, ఎదులపురం సురేష్; ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన సంఘాలకు బుద్ధిచెబుతాం

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు రాకుండా చేసిన కార్మిక సంఘలకు వచ్చే ఎన్నికల్లో నష్టం కలిగించి వారికి తగిన బుద్ధి చెబుతామని సింగరేణి వారసత్వ ఉద్యోగాల సాధన కమిటీ కన్వీనర్ కొమ్ముల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం సీసీసీ నస్పూర్ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు తెస్తామంటూ తెబొగకాసం, తెరాస మోసం చేశాయన్నారు. రాజ్యాంగంలోని సవరణలు 14, 16కు లోబడి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని హైకోర్టు సూచించనప్పటికీ తెబొగకాసం, యాజమాన్యం ఆ దిశగా ప్రయత్నించలేదన్నారు. జాతీయ సంఘాలు వారసత్వ ఉద్యోగాలు సాధించకుండా ఎన్నికలకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గుర్తింపు, జాతీయ సంఘాల వైఖరి కారణంగా వారసత్వ ఉద్యోగాలు రాకుండా జరిగిన అన్యాయాన్ని కార్మిక కుటుంబాలకు వివరిస్తామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారంలో ఉపరితల గని పేరుతో గ్రామాలను విధ్వంసం చేయడాన్ని యాజమాన్యం నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సింగరేణి వారసత్వ ఉద్యోగాల సాధన కమిటీ నాయకులు, ఓపెన్‌కాస్టు వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఫయాజ్, ఎర్రోళ్ల నరేష్, సతీష్, ఎనగందుల వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, కుమారస్వామి, క్రాంతి, మహేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియా డీవైజీఎం(పీ)గా పనిచేసి బదిలీపై బెల్లంపల్లికి వెళ్లిన జె.కిరణ్‌ను, ఏరియా జీఎం కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్.వెంకటేశ్వర్లును బుధవారం ఏరియా అధికారులు, జీఎం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా డీజీఎం(పీ) జె.చిత్తరంజన్‌కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. పర్సనల్ విభాగంలో పనిచేసిన కిరణ్, వెంకటేశ్వర్లు సంస్థలో పారిశ్రామిక సంబంధాలు మెరుగు పరిచేందుకు విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా మాజీ డీజీఎం(పీ) శర్మ, పర్సనల్ మేనేజర్లు జీవీ కిరణ్‌కుమార్, ఉదయ్ మోహన్, ఆజ్మీరా తుకారాం, అనిల్‌కుమార్, తెబొగకాసం పిట్ కార్యదర్శి రాళ్లబండి రాజన్న, కార్యాలయ సిబ్బంది ప్రభు, వెంకటేశ్వరరావు, పీఆర్‌ఏ సంపత్‌కుమార్, సూర్యకుమార్, సత్యనారాయణ, నాగమణి, విశ్వేశ్వరరావు, రాజయ్య పాల్గొన్నారు.

రసాయనాలు వద్దు... కషాయాలు ముద్దు



సేంద్రీయ పద్ధతులతో పండించిన వరి పొలంలో రైతు శ్రీనివాస్

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

రైతులు రసాయన, క్రిమి సంహారక మందులు వాడటం వల్ల పంటల సాగు వ్యయం పెరిగిపోతుంది. భూసారం తగ్గి నానాటికి దిగుబడి తగ్గుతోంది. ఓ వైపు ఉత్పత్తి వ్యయం పెరగడం.. మరోవైపు దిగుబడి తగ్గడంతో సాగుబడిలో రైతులకు నష్టాలు మిగులుతున్నాయి. అయినా చిన్న రైతులు వ్యవసాయాన్ని వదులుకోక అయిన కాడికి అప్పులు తెచ్చి పంటల సాగు చేస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు సేంద్రీయ ఎరువులతో పంటలు పండిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ రైతు సాగు పద్ధతులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- ఎకరాకు రూ.3 వేల ఖర్చుతో చేసి చూపుతున్న రైతు శ్రీనివాస్
- సేంద్రీయ సాగులో ఆదర్శం
- స్వయంగా ఇలా తయారు చేసుకోవచ్చు

పంటల దిగుబడి ఊహించనంతగా తగ్గిపోతున్న తరుణంలో సేంద్రీయ వ్యవసాయం 8 ఏళ్ల కిందట ప్రారంభించారు. మొదట్లో కొంత కష్టాలున్నా.. వాటిని ఎదుర్కొని ఇప్పుడు సత్ఫలితాలను సాధిస్తున్నారు. పలు రకాల పంటలను పండిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. దీన్ని ప్రారంభించక ముందు అప్పటి వరకు రసాయనానికి అలవాటు పడ్డ భూమి సేంద్రీయంతో పంట సాగు చేయడంతో పంట దిగుబడి వచ్చేది కాదు. అయినా పట్టు వదలకుండా కష్టాలకు ఓర్చారు. ఆవు పేడ, మూత్రంతో సాగు చేశారు. రెండేళ్ల తర్వాత ప్రతిఫలం లభించింది. ఇప్పుడు పెట్టుబడి లేకపోవడంతో వచ్చేదంతా చేతి కందుతోంది. విత్తన శుద్ధి మొదలుకొని చీడ పీడల నివారణ వరకు ప్రతి దానికి రసాయన ఎరువులపై ఆధార పడకుండా ఆవు మూత్రం, పేడతో తయారైన వాటినే వాడుతున్నారు.



పచ్చిరొట్టగా సాగు చేసిన జీలుగ

భూమిలో ముందుగా పచ్చిరొట్ట ఎరువును జీలుగా సాగు చేశారు. అనంతరం వరి నాటేముందు 10 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల గోమూత్రం, 2 కిలోల బెల్లం, 2 కిలోల పప్పు ధాన్యాన్ని ఒక చోట కలిపి మూడు రోజుల పాటు నిల్వ ఉంచి అనంతరం వరి నాటేటప్పుడు పొలంలో చల్లాలి. దీంతో భూమి గుల్లబారి వానపాములు పెరిగి భూమి సారమంతమవుతుంది. పంట రోగ నిరోధక శక్తిని పుంజుకుంటుంది. పురుగులు, తెగుళ్ల నివారణకు 5 కిలోల వేపాకు, 5 కిలోల ఉమ్మెత్త ఆకు, ఐదు కిలోల ఆముదం ఆకు, 5 కిలోల సీతాఫలం ఆకులను దంపి 10 లీటర్ల గోమూత్రన్ని మరిగించి పంటపై పిచికారి చేయాలి.

దేశవాళీ ఆవులతో

ఆవు మూత్రం, పేడ కావాలంటే దేశవాళీ ఆవులు కావాలి. అందుకు ఆవులను పెంచుతున్నారు. పాడి తోనే పంట అని చెబుతున్నారు. ఆవు మూత్రం, పేడతో తయారైన బీజామృతం, ఘనజీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, తదితరాలను వాడి వరి, కంది, వేరుశనగ తదితర పంటలను సాగు చేసి అధిక దిగుబడులను సాధిస్తున్నారు.



పేడ, మూత్రం కోసం పెంచుతున్న ఆవులు

విత్తన శుద్ధి నుంచి చీడ పీడల నివారణకు

సేంద్రీయ వ్యవసాయంలో భాగంగా విత్తన శుద్ధి మొదలుకొని చీడ పీడల నివారణకు రసాయన ఎరువులు అసలే వాడటం లేదు. బీజామృతంతో విత్తన శుద్ధి చివరి దుక్కిలో ఘన జీవామృతం చల్లి పంట సాగు చేశారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఆవు మూత్రంతో తయారైన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి వాటిని పిచికారి చేయడం. ఇలా సాగైన పంటలు ఎలాంటి చీడ పీడలు లేకుండా ఏపుగా ఎదుగుతాయి.

రూ. 10వేల పెట్టుబడిని రూ.3వేలకు తగ్గించి..

సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతోంది. దీంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకుంటే 80 శాతం మేర పెట్టుబడులు తగ్గించుకోవచ్చు. ఒక ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు రూ. 10 వేలకు పైగా రసాయనిక ఎరువులను వినియోగిస్తే కేవలం రూ.2 వేల నుంచి రూ.3 వేల పెట్టుబడితో సేంద్రీయ ఎరువులు వాడి పంట సాగు చేసుకోవచ్చు.

మంత్రి, పాలనాధికారి అభినందన

రైతు గాదె శ్రీనివాస్ సేంద్రీయ వ్యవసాయం చేస్తూ లాభాలు సాధిస్తున్నారు. పూర్తి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారు. దీంతో అటవీ శాఖ మంత్రి జోగు రామన్న, జిల్లా పాలనాధికారి కర్ణణ్ పంటను పరిశీలించారు. సాగు విషయాలు తెలుసుకొని అభినందించారు. ఇలాంటి సాగు ఆరోగ్యానికి శ్రేష్టమని రైతులు శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకొని సేంద్రీయ సాగు చేపట్టాలని పేర్కొన్నారు.

పంటకు బలం కోసం



ఘన జీవామృతం తయారు చేస్తూ..

బీజామృతం: తయారు కావాలంటే 20 లీటర్ల నీరు దేశవాళీ ఆవు పేడ, మట్టి, సున్నం కావాలి. 20 లీటర్ల నీటిని తీసుకొని వారం రోజుల్లోపు సేకరించిన ఐదు కిలోల దేశవాళీ పేడను పల్చటి గుడ్డలో చుట్టి 12 గంటలు నానబెట్టాలి. ఒక లీటర్ నీటిలో 50 గ్రాముల సున్నం నానబెట్టాలి. 12 గంటల అనంతరం నానబెట్టిన పేడ మూటను గట్టిగా పిండి సారాన్ని నీటి తొట్టిలో కలపాలి. పొలం గట్టు నుంచి సేకరించిన దోసెడు మట్టిని పేడ నీటిలో కలియతిప్పాలి. ఐదు లీటర్ల ఆవు మూత్రం, సున్నపు నీటిని పేడ నీరున్న నీటి తొట్టిలో కలిపి బాగా కలియబెట్టి 12 గంటల పాటు నిల్వ ఉంచాలి. 12 గంటల తర్వాత బీజామృతం సిద్ధమవుతుంది. ఇలా సిద్ధమైన దాన్ని 48 గంటల లోపు విత్తనాలకు బాగా పట్టించి ఆరబెట్టి విత్తుకోవాలి.

జీవామృతం: వారం రోజుల లోపు సేకరించిన 10 కిలోల ఆవు పేడ, అయిదు నుంచి 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల శనగలు, ఉలవలు, పెసర్లు మినుముల పిండి ఐదైనా ఒకదానికి తీసుకొని దోసెడు గట్టు నుంచి సేకరించిన మట్టి ఇవన్నీ 200 లీటర్ల నీటిలో అన్నింటినీ కలిపి 48 గంటల పాటు నానబెట్టాలి. 48 గంటల తర్వాత తయారైన ఈ జీవామృతం ఎకరం విస్తీర్ణానికి సరిపోతుంది.

ఘన జీవామృతం: అయిదు లీటర్ల దేశవాళీ ఆవు మూత్రం, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల శనగలు, ఉలవలు, పెసర్లు మినుముల పిండి ఐదైనా ఒకదానికి తీసుకొని అరకిలో పొలం గట్టు నుంచి సేకరించిన మట్టి తీసుకొని బాగా కలిపి పది రోజులు నానబెట్టాలి. తర్వాత 100 కిలోల ఆవు పేడలో కలిపి ఎకరం పొలంలో వెదజల్లి దున్నాలి. ఇలా తయారైన ఘన జీవామృతంను వారం రోజుల్లోపు ఉపయోగించాలి.

సేంద్రీయ వ్యవసాయంతో లాభాలు

- గాదె శ్రీనివాస్, రైతు నెల్కివెంకటాపూర్

సేంద్రీయ వ్యవసాయంతో ఎన్నో లాబాలున్నాయి. సేంద్రీయ ఎరువులను వాడడం వలన మన ఆరోగ్యాన్ని రక్షించుకోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకొవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. అందరూ ఈ దిశగా ఆలోచించాలి.

చీడ పీడల నివారణకు



సేంద్రీయంగా పెంచిన వరినారు

నీమాస్త్రం: రసం పీల్చే పురుగులు ఇతర చిన్నచిన్న పురుగుల నివారణకు దీనిని పిచికారి చేయాలి. వంద లీటర్ల నీటిలో ఒక కిలో దేశవాళీ ఆవు పేడ, ఐదు లీటర్ల ఆవు మూత్రం, ఐదు కిలోల వేప గింజల పిండి కలిపి బాగా కలియతిప్పి 24 గంటల పాటు పులియపెట్టాలి. ఉదయం, సాయంత్రం ఐదు నిమిషాల పాటు కలియతిప్పాలి. 24 గంటల తర్వాత పల్చటి గుడ్డ తీసుకొని దానిని వడబోసి పెట్టుకోవాలి. ఇలా తయారైన ద్రావణాన్ని నీమాస్త్రం అంటారు. దీన్ని వారం లోపు పంటలపై పిచికారి చేయాలి.

బ్రహ్మాస్త్రం: అన్ని రకాల పురుగుల నివారణకు దీన్ని వాడుతారు. రెండు కిలోల వేపాకు, రెండు కిలోల సీతాఫలం ఆకులు రెండు కిలోల పల్లెరు ఆకులు తీసుకొని వేర్వేరుగా నూరి ముద్ద చేయాలి. వీటిని 20 లీటర్ల ఆవు మూత్రంలో వేసి బాగా ఉడికించాలి. నాలుగు సార్లు పొంగు వచ్చే వరకు మరగ కాచి 24 గంటల పాటు చల్లారనివ్వాలి. తర్వాత వడకట్టి నిల్వ చేసుకోవాలి. ఇలా తయారైన బ్రహ్మాస్త్రంను ఆరు నెలలలోపు ఎకరాకు రెండున్నర లీటర్ల చొప్పున వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

అగ్ని అస్త్రం: ఆకు ముడత, కాండం తొలిచే, కాయతొలిచే, వేరు కుళ్లు పురుగుల నివారణకు వాడుతారు. ఇరవై లీటర్ల ఆవు మూత్రం, అరకిలో దంచిన మిరపకాయలు, ఒక కిలో దంచిన పొగాకు అరకిలో దంచిన వెల్లుల్లి కలిపి ఐదు సార్లు పొంగు వచ్చే వరకు బాగా మరగ కాచిన తర్వాత చల్లార్చాలి. వడకట్టి నిల్వ చేసుకోవాలి. ఇలా తయారైన అగ్ని అస్త్రంను రెండు లీటర్ల నీటిని తీసుకొని 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటకు పిచికారి చేయాలి.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ రమేష్



గిరిజన బాలుర గురుకుల ప్రిన్సిపల్ లక్ష్మణ స్వామి దంపతులను సన్మానిస్తున్న ఆర్‌సీఓ రమేశ్, ఉపాధ్యాయులు

ఇచ్చోడ: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఆ వృత్తిలో విధులు నిర్వర్తిస్తున్న వారందరు అదృష్టవంతులుగా భావించాలని ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త టి.రమేశ్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఉద్యోగ విరమణ పొందిన ఇచ్చోడ గిరిజన బాలుర గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ బి.లక్ష్మణస్వామి, సంధ్యారాణి దంపతులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పని చేయాలని, గురుకుల విద్య రాష్ట్రంలో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపల్ దంపతులను పలువురు ఉపాధ్యాయులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీఓ గంగాధర్, ఏటీడబ్ల్యూఓ ఆత్రం భాస్కర్, ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ టి.నాగేశ్వర్‌రావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

68 పోస్టులు.. దరఖాస్తులు 1,240

సమర్పించడానికి నేడు చివరి గడువు



ఉద్యోగాల కోసం దరఖాస్తులు అందజేస్తున్న అభ్యర్థులు

ఎదులాపురం, న్యూస్‌టుడే: రిమ్స్‌లో భర్తీ చేయనున్న స్టాఫ్‌నర్సు, రోగుల సహాయకుల పోస్టులకు బుధవారం నాటికి మొత్తం 1,240 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు సమర్పించడానికి గురువారం చివరి గడువు కావడంతో ఈ సంఖ్య 1,500లు దాటిపోయే అవకాశం ఉంది. రిమ్స్‌లో 44 స్టాఫ్ నర్సు పోస్టులు, 24 రోగులు సహాయకుల పోస్టులను పొరుగు సేవల ద్వారా నియమించడానికి ప్రకటన జారీ చేశారు. ఈ మేరకు స్టాఫ్ నర్సు ఉద్యోగాల కోసం బుధవారం నాటికి 510, రోగుల సహాయకుల ఉద్యోగాల కోసం 730 దరఖాస్తులను అధికారులు అందుకున్నారు. కాగా ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన ప్రకటనలో స్పష్టత కొరవడిందనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో కొంత మేర అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

ప్రతిభ

Junior Inter STUDY PLAN

Zoology

Generally, the aim of a student joined in Intermediate Bi. P. group is to secure a seat in a reputed Medical College to study M.B.,B.S. or other allied Medical Course. To get a seat in M.B.,B.S. one has to face the National Eligibility Entrance Test (NEET) and secure a good rank. Hence, while preparing for Intermediate Public Examination (IPE), critical, analytical and planned study is required.

Tips to tap good score...

In IPE, the Zoology Paper is for 60 marks. Out of the 60 marks, 20 marks are allocated for Very Short Answer Questions [VSAQ : 10 questions × 2 marks], 24 marks are allotted for Short Answer Questions [SAQ : 6 questions × 4 marks] and 16 marks for Long Answer Questions [LAQ : 2 questions × 8 marks]. The syllabus of Zoology is divided into 8 Units. Weightage (approximate) of Marks for each unit is given below:

S. No.	Unit	Marks Allocated
I	Diversity of Living World	06
II	Structural Organisation in Animals	10
III	Animal Diversity - I (Nonchordates)	06
IV	Animal Diversity - II (Chordates)	06
V	Locomotion and Reproduction in Protozoans	08
VI	Biology in Human Welfare	14
VII	*Periplaneta americana* (Type Study)	12
VIII	Ecology and Environment	14

- As there is no choice for VSAQ, all questions should be answered. To answer these questions, all topics are to be understood clearly, read thoroughly and remember the subject matter. Answer for these questions must be direct and brief. For example...

  Q. A person is suffering from bowel irregularity and abdominal pain. His stools contains blood and mucus. Based on these symptoms, name the disease and the causative organism.

Ans. a. Disease : Intestinal amoebiasis / Amoebic dysentery.

b. Causative organism: *Entamoeba histolytica*

- Eight SAQ will be given. One has to answer any six in 15-20 lines each. Some questions are related to drawing the diagram and labelling also. Answer for some SAQ may not be in 20 lines and for some, it may be more than 20 lines. Hence, do not count the number of lines. Write the perfect and complete answer. If diagram is asked, draw it with a sharply pointed pencil and label the parts towards right side. If space is not sufficient, write on left side also. Generally diagrams are asked from the units II and VII.
- Regarding LAQ, three questions will be given. You have to answer any two which are familiar to you. Each answer should be in 45-60 lines. Illustrations are also necessary for these questions. This type of questions are selected from the units II, VI, VII and VIII.

Important...

- *Generally for IPE, the questions for public examination are selected from the list of questions given at the end of each unit of BIE / Telugu Akademi Text Book.*
- *While preparing a unit, first read LAQ. They cover some SAQ and VSAQ.*
- *Then read remaining SAQ. They cover some VSAQ. Then read the remaining VSAQ.*



Writer:
K. Sreeramulu
Subject Expert

Syllabus and Questions

I. Zoology - Diversity of Living World

- Generally a two marks question will be given from this unit from branches of Zoology, species, nomenclature etc.
- Four marks question is generally given from basic concepts of classification, species concept and biodiversity.

II. Structural Organisation in animals

- From the topics symmetry-types, body cavity-types two and four marks questions are common. From animal tissues, two and four marks, diagram related questions and sometimes eight marks question may be asked.

III. Animal Diversity - I


- This unit is related to the characters and classification of non-chordates. Two and four marks questions are asked from this unit.
- To study the characters, classification; characters of different classes and examples - one has to prepare tables with the help of your text book. Hence, it becomes easy to remember the features and examples.

IV. Animal Diversity - II


- From this unit two and four marks questions are asked from the characters, classification and examples of chordates.
- As in unit III, prepare tables with the help of your text book. So that it becomes easy to remember the things.

V. Locomotion and reproduction in protozoans

- Generally two and four marks questions will be given from this unit.
- Prepare tables regarding locomotory organelles and examples of protozoans and study them.
- Study the mechanisms of locomotion.
- Practice the diagrams of *Euglena* and *Paramoecium*.
- Read the transverse and longitudinal binary fission and definition of conjugation.



Euglena




Paramoecium

VI. Biology in Human welfare


- As more marks are allocated to this unit, concentrate much on this unit.
- Study the types of parasites, hosts, effects of parasites on their hosts thoroughly.
- Keep special attention on structure, life history and pathogenecity of *Entamoeba histolytica, Plasmodium, Ascaris* and *Wuchereria*.
- Also study the symptoms, causative organism and control of typhoid, Pneumonia, common cold and ring worm disease besides TDA abuse.
- All the three types of questions will be given in this unit.

VII. *Periplaneta americana* (Cockroach)

- This unit contains structure, locomotion and body systems of cockroach.
- From the body systems eight marks question may be asked.
- Practice all diagrams thoroughly for a four marks question.
- As this unit is also allocated by more marks, much attention is needed.



Salivary glands of Cockroach



Mouth parts of Cockroach

VIII. Ecology and Environment

- Like units VI and VII, for this unit also more marks are allotted. At the same time, quantity of subject matter is also more.
- As all the topics are related the activities going on around us, understanding these topics is very easy and interesting also.
- Different definitions, abiotic factors in ecosystem and their effects on organisms; population interactions, adaptations, food chains, food web, energy flow, nutrient cycles, pollution etc. need special attention.
- All the three types of questions will be given in this unit.
- While reading concentrate your mind on the Lesson. Victory is yours.

Remember...

- ✓ You have to read more and more. To acquire good knowledge on particular topics you have to read more. Make note of points of what you read. Because it's all about Latin and Greek terms and terminologies in Zoology.
- ✓ Get the latest edition of Zoology Text Book Published by the Telugu Akademi / Board of Intermediate Education for reference and thorough study of the topics.
- ✓ You have to practice a much. Write the answers again and again. It seems laborious and old fashioned but one advantage through practice is you can improve your writing skills and your writing speed increases.
- ✓ An important aspect in Zoology is diagrams. Diagrams are the key factors during your exam preparation. If you study a topic straight, you might not understand it, but with diagram, the same concept can understood well. And during exams, one method which would more appropriate is, draw the diagram first, you can explain the concept easily referring to the diagram, chances of missing the points will be less.
- ✓ Develop patience. Every concept cannot be easily understood. If any concept is taking more time, leave it and begin with easy one. It will build your confidence and you can take on the earlier concept with ease.
- ✓ Start preparing as early as possible. Do not wait till the end. Opening the book at the last moment makes you panic and results in great disappointment.

Send your feedback to
pratibhadesk@eenadu.net

For Tenth, Intermediate Study material please visit...
www.eenadupratibha.net

ప్రతిభ

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ



రచయిత
సీహెచ్. వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.
బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.
సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.
డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.
ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.
ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.
జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.
హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.
ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండు సార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాలు, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాల్లాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.
బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.
సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.
బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.
సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.
డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.
ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు

భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.
ii) దిగుమతుల సరళీకరణ.
iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.

ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పురోగమన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.

హాయ్! బుజ్జీ!!

జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
– గౌతమ బుద్ధుడు



వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?



పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!

■ ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ మరి పేరేంటీ? ఊరేంటీ?

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు. ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ మరి మనం చూడలేమా?

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!

బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

- డి. శ్రీలత, హైదరాబాద్

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!


- మా.శ్రీ. రాజు, పాల్వంచ

చిలిపి ప్రశ్న

తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో ఉంటుంది?

- ఆర్. శ్యామల, హైదరాబాద్

కవలలేరి?



సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.


2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2

రాయగలరా?

ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి
3. ఎలుక 4. పాము
5. గుడ్లగూబ 6. గాడిద

దారేది?



జవాబులు: రాయగలరా: 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey **దాగిన పదం:** Season **కవలలేరి:** a, c **చిలిపిప్రశ్న:** అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

సుడోకు:

2	5	1	4	3	9	7	8	6
8	4	6	1	5	7	9	2	3
9	7	3	8	6	2	4	5	1
4	2	9	7	8	1	6	3	5
3	1	8	5	9	6	2	4	7
5	6	7	2	4	3	1	9	8
7	8	4	6	2	5	3	1	9
6	9	2	3	1	8	5	7	4
1	3	5	9	7	4	8	6	2

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net

ప్రశ్న : హరికేన్, టైఫూన్, సైక్లోన్, తుపాన్‌ల మధ్య తేడాలేమైనా ఉన్నాయా?
- టి. రజని, దేవరపల్లి



హరికేన్, తుపాన్‌ల మధ్య తేడాలేంటి?

జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరిత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

- ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)



చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో ఎంఆర్ టీకాల శిబిరాలు

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దఐనం, చిన్నఐనం, పార్వతిపేట, బొప్పూరం గ్రామాలో బుధవారం రూబెల్లా కార్యక్రమంలో భాగంగా ఎంఆర్ టీకాల శిబిరాలు ఏర్పాటు చేసినట్లు హెచ్‌వి రేణుక తెలిపారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 853 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు విజిత, పద్మ, సంతోషమ్మ, హేమలత, లక్ష్మి, శారద, లీలావతి, శాంత, ఆరోగ్య సహాయకుడు ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూరు(టి): మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రూబెల్లా తట్టు టీకా మందును వేశారు. పాఠశాల విద్యార్థులకు తల్లితండ్రులకు రూబెల్లా టీకా మందు పని చేసే విధానంపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు రమేష్, ఆరోగ్య కార్యకర్తలు ప్రేమా, భూదేవి, లలిత, అనంతరం మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలలో విద్యార్థులకు రుబెల్లా టీకా మందు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రవిదాసు, నర్సయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రూబెల్లా టీకా మందు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన: శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: పాడుతా తీయగా... (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమ ఘుమలు 'వంకాయ బజ్జీ కూర', మీచేతి వంట 'పెసల పులావ్', 'మేథి క్యారెట్ ఫ్రై', జస్ట్ ఎ మినిట్ 'బేసిన్ బర్ఫీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్–2 (రిపీట్), 05-30: ఆడాళ్ళా మజాకా: రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్: మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 ఆనందోబ్రహ్మ రిపీట్

01:15 డిజె రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 ఈ-జంక్షన్ రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 పోవే..పోరా

09:00 పటాస్

09:30 మైకేల్ మదన్ కామరాజు

09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్

10:00 ఆనందోబ్రహ్మ

10:15 డిజె

10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)

★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)

★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)

★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)

★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).

★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)

★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్విని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చిట్టి చెగోడీలు & పులిహోర, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – స్వీట్ పన్నీర్ బుర్జీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) – డైజెస్టివ్ డ్రింక్, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - గన్ పౌడర్ & ఇడ్లీ, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – రామ్ లడ్డూ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ప్రాన్స్ అండ్ బేబికార్న్ కట్‌లెట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్డ్ క్యూసైన్) – లాంబ్ స్కివర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - చికెన్ మిర్చి బజ్జీ, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – కోల్హాపూరి పన్నీర్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ చీజ్, మ.5.15: స్నాక్స్ - పన్నీర్ చీజ్ తవ రోటి.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి**, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాధం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్నాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందే హాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా:, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

మా (Star Maa) — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: రాజా రాణి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: అందరివాడు, **సాయంత్రం:** 05-30 ఓకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ గోదావరి మొగుడు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

పత్తిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు

తెలంగాణలో ఖరీఫ్‌లో పత్తిని ప్రధాన పంటగా లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. జూన్ మొదటి పక్షం నుంచే ఈ పంటను విత్తుకున్నారు. ప్రస్తుతం పైరు పలు దశల్లో ఉంది. ప్రతికూల పరిస్థితుల్లో పత్తి పైరుపై తొలి దశలో ఆశించేచీడపీడలతో నష్టం ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణ, ఎరువుల వాడకం వివరాలను నిర్మల్ జిల్లా భైంసా వ్యవసాయ సహాయ సంచాలకుడు అమరేశ్‌కుమార్ వివరించారు.

★ ఇటీవలి వర్షాలకు నేలలో తేమ పెరిగి, మొక్కలు వడలిపోతున్నాయి. నల్లరేగడి భూముల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. దీనిని అధిగమించేందుకు తోటలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలి. ఒక లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ గాని, 2 గ్రాములు రిడోమిల్ గాని కలిపి మొక్కల వేర్లు తడిచేలా మొదళ్ల వద్ద పిచికారి చేయాలి.

రసంపీల్చే పురుగులు..

★ చేలో పేనుబంక ఆశించిన మొక్కలు 10-20 శాతం, పచ్చదోమలు ఆకుకు 2, తెల్లదోమలు 20, తామర పురుగులు ఆకుకు 10 ఉంటే పంటకు అధికంగా నష్టం వాటిల్లుతుంది. తొలి దశలో రసంపీల్చే పురుగుల వల్ల అధికంగా నష్టం వాటిల్లుతుంది. అలాంటి పైర్లకు కాండం పూత అవసరం. పైరు 20, 40, 60 రోజులకు కాండం పూత ఆచరించాలి. ఒక పాలు మోనోక్రొటోఫాస్ లేదా మిథైల్ డెమటాన్, నాలుగు పాళ్లు నీరు లేదా ఒక పాలు ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్.ఎల్, 20 పాళ్లు నీరు కలిపిన ద్రావణాన్ని మొక్కల లేత కాండంపై పూత పూయాలి. అవసరాన్ని బట్టి లీటరు నీటికి మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లీటరు నీటికి వంతున కలిపి పిచికారి చేయాలి.



మొక్క కాండంపై పిండినల్లులు

★ పిండి పురుగులు లేత ఆకులు, కొమ్మల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఇవి ఆకులపై విసర్జించిన పదార్థంపై మసి తెగులు వ్యాపించి మొక్కలు వడలిపోతాయి. ఈ పురుగుల నివారణకు గట్లపైన, అడవి బెండ, పార్థీనియం, చిలుకముక్కుఆకు వంటి కలుపు మొక్కలను తొలగించాలి. పిండి పురుగులు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. పురుగుల విసర్జితాలపై నల్ల చీమలు ఆశిస్తాయి. చీమల ఉనికి ఆధారంగా పిండి పురుగులు ఆశించినట్లు సులభంగా గుర్తించవచ్చు. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మిథైల్ పెరాథియన్ 2 మి.లీ. లేదా ట్రయిజోఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు + 0.5 మి.లీ శాండోవిట్, లీటరు నీటికి వంతున కలిపి చేతిపంపుతో పిచికారి చేయాలి.



పేనుబంక ఆశించిన మొక్క

★ అధికంగా బీటీ రకాలనే సాగు చేసినందున రసంపీల్చే పురుగులు మినహా మిగతా చీడపీడల ఉధృతి తక్కువగానే ఉంది. 10 కిలోల వేపగింజల పొడిని రాత్రంతా నీటిలో నానబెట్టి మరుసటి రోజు దీని కషాయాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులు పైరు దరిచేరవు.

దిగుబడి పెంచే చర్యలు

★ పైరు 90-100 రోజుల వయసులో మొక్కల లేత చిగుర్లను తుంచి వెయ్యాలి. దీనివల్ల పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూత, కాత అధికంగా వస్తుంది. చిగుర్లపై పెట్టిన శనగపచ్చ పురుగుల గుడ్లు నశించి పైరుపై పురుగుల ఉధృతి తగ్గుతుంది. పత్తిలో కంచె పంటలు, ఆకర్షక పంటలు, అంతర పంటల సాగుతో పురుగులను చాలా వరకు అరికట్టవచ్చు.

★ చాలా మంది రైతులు ప్రస్తుతం భాస్వరం, కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేస్తున్నారు. భాస్వరాన్ని దుక్కిలోనే వేయాలి. పైపాటుగా భాస్వరాన్ని వేస్తే ఎరువు వృథా అవుతుంది. ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను మాత్రమే పైపాటుగా వేయాలి. యూరియాతో కలిసి ఉన్న పొటాష్‌ను కూడా ఎరువులో పోషకాల మోతాదును సరిచూసి పంటకు పైపాటుగా వేయవచ్చు.

– న్యూస్‌టుడే, కుంటాల



నిండు కుండను తలపిస్తున్న స్వర్ణ ప్రాజెక్టు; 1181.9 అడుగులకు చేరుకున్న స్వర్ణ జలాశయం

స్వర్ణకు పోటెత్తిన వరద

★ గేటుఎత్తి దిగువకు నీటి విడుదల

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మండలంలోని స్వర్ణ జలాశయానికి వరదనీరు పోటెత్తింది. మంగళవారం రాత్రి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో భారీగా వర్షం కురవడంతో జలాశయంలోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది. అప్పటి వరకు 1179.5 అడుగులు వద్ద స్థిరంగా వున్న నీటి మట్టం 1181.9కు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు సిబ్బంది రాత్రి రెండు గంటల సమయంలో ఒక గేటును ఎత్తారు. పై నుంచి 569.1 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరగా వరద గేటు ద్వారా 370, జైళినాళ, కుడి, ఎడమ కాలువల నుంచి 77 కలిపి మొత్తం 447 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు నీటి పూర్తిస్థాయి నీటి మట్టలం 1183 అడుగులు కాగా స్వర్ణ ప్రాజెక్టు 1.48474 టీఎంసీల సామార్థ్యం కలిగి వుంది. ప్రస్తుతం 1.36505 టీఎంసీల నీరు నిలకడగా ఉంది. కేవలం జలాశయంలో ఒక అడుగు నీరు మాత్రమే చేరాల్సి ఉంది. స్వర్ణ ప్రాజెక్టు నిండు కుండను తలపించడంతో ఆయకట్టు రైతులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలకు నీరు అండడంతో పాటు భూగర్భ జలాలు పెరగుతాయని ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. జలాశయంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులన్ని జలకళను సంతరించుకున్నాయి. అలుగులు పోస్తున్నాయి.

కఱ్ర గణనాథునికి ప్రత్యేక పూజలు

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పట్టణ కఱ్ర పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన కఱ్ర గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. బుధవారం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యల భక్తులు తరలివస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, మధ్యాహ్నం హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నగునూరి బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి వన్నెపన్ని శివకుమార్, కోశాధికారి చిలమంతుల రాజలింగం, సభ్యులు పాల్గొన్నారు.



కొలువుదీరిన కఱ్ర వినాయకుడు



భోజనాలు చేస్తున్న భక్తులు

రైతుల మేలుకే సమన్వయ సమితుల ఏర్పాటు

★ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

వేంపల్లి (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చే నెల 1 నుంచి 9 వరకు చేపట్టనున్న రైతు సమన్వయ సమితుల ఏర్పాటు కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, రైతులు ఐక్యంగా నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి కళ్యాణ మండపంలో జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండపరిషత్తు ఉపాధ్యక్షులు, వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, రైతులతో రైతుసమన్వయసమితి ఏర్పాటుపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు చెల్లించనున్న తరుణంలో రైతుల సమన్వయసమితులను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికోసం వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా గ్రామ, మండలస్థాయిలో రైతులతో సమావేశం నిర్వహించి గ్రామస్థాయి, మండలస్థాయి సమితిలను ఏర్పాటుచేయాలని సూచించారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయిలో రైతుసమన్వయ సమితులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాలకు డిసెంబర్‌లోగా రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. దీనికోసం అధికారులతో నిరంతరంగా సమీక్షలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ మాట్లాడుతూ రైతులను ఐక్యంగా ఉంచేందుకే ఈ సమన్వయసమితిలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మిషన్‌భగీరథ పథకం పనులతో రహదారులు, పైపులైన్లు నష్టపోయినట్లయితే ఆ పనులను తిరిగి గుత్తేదారులే చేసేలా మంత్రి ఐకే రెడ్డి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ తెలంగాణను సస్యశ్యామలంగా ఉంచేందుకే సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎంతో శ్రమపడుతున్నారన్నారు. మంచిర్యాల శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ రైతుసమన్వయ సమితిల ఏర్పాటులో రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. మున్సిపాలిటీల పరిధిలో వ్యవసాయం చేసే రైతులకు ఈ పథకం వర్తించేలా చూడాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ, శిశుసంక్షేమ శాఖ రీజనల్ ఆర్గనైజర్ అత్తి సరోజ, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ మూల రాజిరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్‌కమిటీ ఛైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు

విద్యార్థులకు టాస్క్‌పై అవగాహన సదస్సు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక దీక్ష డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో బుధవారం నైపుణ్య శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షకుడు అద్దిగ శ్రీనివాస్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగాలను పొందే సమయంలో మౌఖిక పరీక్షకు ఎంతో ప్రాధాన్యముంటుందని, తెలిసిన విషయాన్ని ఎదుటివ్యక్తికి అర్థవంతంగా చెప్పేందుకు భాషపై పట్టుసాధించడం కీలకమని పేర్కొన్నారు. రెండు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న టాస్క్ పథకంలో కళాశాలను అనుసంధానం చేశామని, దీనివల్ల ఉద్యోగాలను పొందటం మరింత సులభమవుతుందని కళాశాల డైరెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానాధ్యాపకుడు మెంగ శ్రీధర్, కళాశాల యాజమాన్య సభ్యుడు ప్రమోద్‌రావు, శిక్షకుడు లక్ష్మణ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కనుల పండువగా పూలాజీబాబా జన్మదిన వేడుకలు

జైనూరు, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక గురువు సద్గురు పరమహంస పూలాజీబాబా జన్మదిన వేడుకలు మండలంలోని పట్నాపూర్ గ్రామంలోని ధ్యాన కేంద్రంలో కనుల పండువగా జరిగింది. పులయ ధ్యాన కేంద్రంలో తొలుత పూలాజీబాబా జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథ పఠనం పూజలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనసందోహం మధ్య 93వ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. అంతకు ముందు ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా భక్తులనుద్దేశించి మాట్లాడారు. సృష్టిలో మానవులంతా ఒక్కటేనని కులమత బేధాలకు తావులేకుండా సమాజంలో శాంతిని నెలకొల్పడమే మానవ ధర్మమన్నారు. పట్నాపూర్‌లోని పూలాజీబాబా ధ్యానకేంద్రం (ఆశ్రమం) భక్తకోటి జనులకు అంకితమని పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలనదే తన ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో పులయ ట్రస్టు కమిటీ గౌరవ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్, అధ్యక్షుడు ఇంగ్లే వామన్, సభ్యులు మగాడే దాదారావు, సూర్యభాన్, బివాజీ, పూసం జగ్వతి, రాంజీ ముండే, ఇంగ్లే దేవురావు, సర్పంచి ఇంగ్లే అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు సమన్‌బాయి, అంద్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, నాయకులు రితేష్‌రాథోడ్, శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న భక్తులు; మాట్లాడుతున్న పూలాజీబాబా



మాట్లాడుతున్న డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు

పథకాల అమలులో చిత్తశుద్ధి అవసరం

★ నిర్మల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అమలులో చిత్తశుద్ధి అవసరమని డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకుల సమావేశంలో మాట్లాడారు. పింఛన్ పంపిణీలో వేలిముద్రలు రాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించాలని పలు సూచనలు చేశారు. గ్రామాల్లో చేపట్టిన డంపింగ్‌యార్డు నిర్మాణాలు త్వరగా చేపట్టేలా చూడాలన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద కొనసాగుతున్న సేంద్రియ ఎరువుల నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వంటగదుల నిర్మాణాలు జాప్యాన్ని నివారించాలన్నారు. ఐకేపీ ఏపీఎం విజయభారతి ఐకేపీ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గజ్జారాం, ఏపీఎం లక్ష్మారెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.